నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నల్లగొండ
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

మాతా, శిశు మరణాలకు గల కారణాలను విశ్లేషించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

మాతా, శిశు మారణాలను తగ్గించడంలో భాగంగా మాతా, శిశు మరణాలు సంభవించడానికి గల కారణాలను విశ్లేషించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో నల్గొండ జిల్లా డివిజన్ కు సంబంధించి మాతా, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవిస్తే ఈ విషయాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మాత ,శిశు మరణాలను అరికట్టడంలో అంగన్వాడీ, ఆశాలది కీలకపాత్ర అని చెప్పారు. అనారోగ్యం కారణంగా మరణాలు సంభవించినప్పుడు వైద్యులు, నర్సులు ,మెడికల్ సహాయం అవసరం అవుతుందని, అయితే అవగాహన లోపం, పౌష్టికాహార లోపం, నిర్లక్ష్యం వంటి కారణాలవల్ల మాత, శిశు మరణాలు సంభవిస్తే సరైన విధంగా వారికి అవగాహన కల్పించకపోవడం వల్లనే మరణాలు సంభవిస్తున్నాయని అర్థం వస్తుందని తెలిపారు. ఈ విషయంలో అంగన్వాడీ,ఆశలు కీలక పాత్ర పోషించాలని కోరారు. మాత ,శిశు మరణాల కారణాలపై విశ్లేషణ చేయాలని, మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఆశాలు ప్రతిరోజు వారి ఇంటికి వెళ్లి గమనించాలని తెలిపారు



.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కట్టంగూరు, లైన్ వాడ ,కేతపల్లి, చిట్యాల, కనగల్ ,రాములబండ, మాన్యం చెలుక ,తదితర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలో గత సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు సంభవించిన మరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మాతా శిశు మరణాలు సంభవించకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ,జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ వందన ,డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ కల్యాణ చక్రవర్తి వైద్యాధికారులు, సిడిపిఒలు,ఆశ, అంగన్వాడీ పాల్గొన్నారు.

అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలిస్తేనే.. ఓటరు గెలిచినట్టు

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఈ నెల 27 న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలోఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటరు గెలిచినట్టని, ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని, అప్పుడు ఓటర్ ఓడిపోతారని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని కోరారు.నర్సిరెడ్డి మాత్రమే గత ఆరేండ్లుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కషి చేశారని, నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందని, వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని అన్నారు. తనకు మంజూరైన నియోజకవర్గ అభివద్ధి నిధులను 100 శాతం పాఠశాలలు, కళాశాలల అభివద్ధికి కేటాయించారని, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పేదలకు వైద్య సహాయం కోసం నాలుగున్నర కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామన్న హామీ మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీల్లో అమలు జరగడం లేదన్నారు. రెండేళ్లుగా ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్ మెంట్, జీపీఎఫ్, జీఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఇకుబేర్‌లో పెండింగ్ లో ఉన్నాయని, రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు నిబంధనలు రూపొందించి డీఈఓ, డిప్యూటీ ఇఓ, ఎంఈఓ, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపకుల పదోన్నతులు చేపట్టాలని, గురుకులాల పనివేళలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించాలని, కేజీబీవీ ఉద్యోగులకు పేస్కేలు ఇవ్వాలని, కేర్ టేకర్లను నియమించాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకంటే ముందు నల్లగొండ జిల్లాలోని పలు పాఠశాలలను రవి సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎం రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, జిల్లా కార్యదర్శి గేర నరసింహ, నలపరాజు వెంకన్న తెలంగాణ పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి నర్రా సరళ, మండల బాధ్యులు రమణ తదితరులు పాల్గొన్నారు.



జెర్రిపోతుల బిక్షమయ్య గౌడ్ మరణం పార్టీకి తీరని లోటు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-చండూరు

మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జెర్రిపోతుల భిక్షమయ్య ప్రజాసంఘాలలో చురుకుగా పాల్గొని గీత కార్మిక సంఘం కూలి సంఘాల్లో పాల్గొని ముందు నడిచినటువంటి బిక్షమయ్య అకాల మరణం పార్టీకి తీరనిలోటని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని సుధాకర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి ఎల్లవేళలా అండదండలు ఇస్తామని అన్నారు. బిక్షమయ్య పెద్ద కుమారుడు అయిన జెర్రిపోతుల ధనంజయ గౌడ్ పార్టీలో చండూరు మండల కార్యదర్శిగా పనిచేస్తూ చురుగ్గా పాల్గొంటూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాడని ఆయన సహకారంతో ముందుకు నడిచేవాడని వారు కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలోక ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, చిన్నపాక లక్ష్మీనారాయణ ,పాలడుగు నాగార్జున ,జిల్లా కమిటీ సభ్యులు నాంపల్లి చంద్రమౌళి, మల్లం మహేష్, సీఐటీయూ మండల నాయకులు చిట్టిమల్ల లింగయ్య,వెంకటేశ్వర్లు, పగిళ్ల బిక్షం, నల్లగంటి లింగస్వామి, కత్తుల సైదులు, హమాలి సంఘం నాగరాజు యాదయ్య ఉన్నారు.



ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా

ఆకారపు నరేష్ ఖమ్మంపాటి శంకర్ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-క్లాక్‌టవర్

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా మహాసభలు 19,20తేదీల్లో నల్లగొండ పట్టణంలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హల్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో నిర్వహించారు. అనంతరం నల్లగొండ జిల్లా అధ్యక్షా కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మంపాటి శంకర్‌లి ను ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. నూతన జిల్లా కమిటీ 28మందితో పాటు నూతన జిల్లా ఆఫీస్ భేరర్స్‌గా 10మందితో ఎన్నిక అయ్యారు. నూతన జిల్లా ఆఫీస్ భేరర్స్‌గా కుర్ర సైదా నాయక్, కోరె రమేష్, బుడిగ వేంకటేష్, ముస్కు రవీందర్, మారుపాక కిరణ్,రవి,కావ్య, స్పందన జిల్లా కమిటీ సభ్యులు లను ఎన్నికయ్యారు.అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థులు ఎదు ర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి బలమైన విద్యార్థి ఉద్యమాలు చేపట్టుతామని చెప్పారు.ఈ మహా సభలకు ఆర్థికంగా, హర్దికంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ విద్యా వంతులకు మేధావులకు, మీడియా మిత్రులకు, పత్రిక విలేకరుల ధన్యవాదాలు తెలిపారు.





తీర్మానాలు

తెలంగాణ రాష్ట్ర లో వున్నా పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని,నల్లగొండ జిల్లా వ్యాప్తంగాఅద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ హాస్టళ్ల కు గురుకుల పాఠశాల లకు సోంత భవనాలు నిర్మించాలని, నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని , రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలను అభివృద్ధి చేయాలని, విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని రాష్ట్రంలో ఖాళిగా వున్నా ఉద్యోగులు భర్తీ చేయాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీకి 1000కోట్లు కేటా యించాలని పలు తీర్మానాలు చేశారు.

6 నెలలకే గర్భిణికి డెలివరీ

- 850 గ్రాముల బరువు తో బేబీకి జన్మనిచ్చిన తల్లి
- 69 రోజుల పాటు హస్పిటలోనే పర్యవేక్షణ
- ఆరోగ్య శ్రీ లో వైద్య సేవలు
- నిలకడగా బేబీ ఆరోగ్యం

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఆరు నెలల గర్భిణీకి డెలివరీ చేసి జ్యోతి హాస్పిటల్ డాక్టర్లు బేబీ కు ప్రాణం పోశారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం సాయంత్రం జ్యోతి హాస్పిటల్ డాక్టర్లు డాక్టర్ జీవనజ్యోతి డాక్టర్ అమూల్య, డాక్టర్ రమేష్, డాక్టర్ వేణుగోపాలరావులు విలేకరులకు వెల్లడించారు. నల్గొండ మండలం లోని చిన్న సూరారం గ్రామానికి చెందిన ఏర్ల అశోక్, రమ్యల దంపతులకు రెండో కాన్పులో మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతి హాస్పిటల్ లో చూపించుకుంటుంది. 6 నెలల గర్భంలోనే పురిటి నొప్పులు రావడంతో జ్యోతి హాస్పిటల్ రాగా 14 డిసెంబర్ 2024న నార్మల్ డెలివరీ చేశారు. ఆడపిల్ల పుట్టగా అన్ని అవయవాలు ఉన్నప్పటికీ అవయవాలు స్పందన లేకపోవడంతో 69 రోజులపాటు ఆసుపత్రుల్లోనే ఉంచి వైద్య సేవలు అందించారు. 24 వారాలు అంటే 6 నెలలోనే రమ్య డెలివరీ అయిందని, పుట్టగానే బేబీ 850 గ్రాములు ఉందని తెలిపారు. 69 రోజులు ఆసుపత్రిలో వైద్య సేవలు అందించిన తర్వాత ఇప్పుడు 1.40 కేజీల బరువు ఉందని, ఆధునిక పరికరాలతో మెరుగైన వైద్య సేవలు అందించడం వల్ల బేబీ ఇప్పుడు ఫీడింగ్ తీసుకుంటుందని చెప్పారు. వైద్యానికి బేబీ సహకరించిందని అన్ని అవయవాలు సరిగా పనిచేస్తున్నాయని చెప్పారు. తక్కువ నెలలో పుట్టిన పాపలు చాలా తక్కువగా బతుకుతారని మా హస్పటల్ వైద్యులు అందించిన సేవలకు ఆ బేబీ ప్రాణాలు పోసుకుందని తెలిపారు. బేబీ ప్రాణాలు కాపాడడంతో తమకు ఏంతో సంతోషం కల్గిస్తుందన్నారు. దీనికి తల్లిదండ్రుల సహకారం ఉందన్నారు. బేబీ ఆరోగ్యం నిలకడగా ఉందని శుక్రవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు.



75 మంది పిల్లలను గుర్తించాము : డా.వేణుగోపాల్ రావు

మిర్యాలగూడ డివిజన్ పరిసర ప్రాంతాలలో గత సంవత్సరన్నర కాలం నుండి సర్వే చేయగా మొత్తం 75 మంది పిల్లలు తక్కువ నెలలో పుట్టినట్లు గుర్తించమన్నారు. 37 నుంచి 40 వారాలు పూర్తిగా నిండాలని, కానీ 28 నెలలు తర్వాత పుడితే పిల్లలు బతుకుతారని అంతకు ముందు పుడితే పిల్లలు బతికే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. ఇందులో 25 మంది పిల్లలు కేజీ బరువు లోపే ఉన్నారని వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించామని తెలిపారు తమ ఆసుపత్రిలో అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయని మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

ఆరోగ్య శ్రీ పథకంలో వైద్య సేవలు

ఈ బేబీ కి పూర్తి వైద్య సేవలు ఆరోగ్యశ్రీలో అందించినట్లు ఆరోగ్య శ్రీ ఇంచార్జీ బషీర్ తెలిపారు. డెలివరీ నుంచి డిశ్చార్జ్ అయ్యేంతవరకు ఆరోగ్యశ్రీలోనే వైద్యసేవలు పొందినట్లు చెప్పారు. ఈ వైద్య సేవలకు రెండు దఫాలుగా 1.40 లక్షలు మంజూరు అయ్యాయని చెప్పారు. 69 రోజుల పాటు బేబీ అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించామని, ఆ బేబీ, తల్లిదండ్రులు ఆసుపత్రిలో ఉండేందుకు సౌకర్యాలు, భోజనం అందించమన్నారు. పేదలు ఆరోగ్య శ్రీ పథకంలో వైద్య సేవలు ఉచితంగా పొందాలన్నారు.

ప్రపంచం చూపు సోషలిజం వైపు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండా శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు

సమాజంలో అన్ని సమస్యలకు పరిష్కారం అంతిమంగా సోషలిజమేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. శుక్రవారం చండూరు మండల కేంద్రంలోని రెడ్ బుక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం సిహెచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ దేశంలో పేదరికం దరిద్రం నిరుద్యోగం, తీవ్రమైన ఆర్థిక అసమానతలతో పాటు సమస్త సమస్యలకు అంతిమ పరిష్కారం సోషలిజం మాత్రమేనని వారన్నారు. 1848లో మార్క్స్ ఎంగిల్స్ రాసిన కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రపంచ చరిత్ర గతిని మార్చిన ఒక మహా పుస్తకం అని దాని ఆధారంగానే ఈ ప్రపంచంలో అనేక విప్లవాలకు అంకురార్పణ జరిగిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేస్తూ దేశ సంపదను స్వదేశీ విదేశీ కార్పొరేట్ శక్తులకు ధారా దత్తం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, లింగయ్య, నాగరాజు సైదులు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో చోరీ

- బంగారం బంగారు ఆభరణాలు అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు...కేసు నమోదు

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ పట్టణంలో గురు వారం మధ్యాహ్నం పట్టపగలు దొంగతనం జరిగింది. పట్టణంలోని సీతారాంపురానికి చెందిన ప్రభుత్వ ఉపా ధ్యాయులు రషీద బేగం రోజు మాదిరిగా గురువారం విధులకు గాను స్కూల్ వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. సాయంత్రం ఐదు గంటలకు ఇంటికి వచ్చిన ఉపాధ్యాయరాలు ఇంటికి ప్రధాన దర్వాజ తాళం పగిలిపోట్టి ఉండడం, వెనుక నుంచి తలుపు తీసి ఉండడంతో గుర్తించి లోపలికి వెళ్లి చూడగా బీర తాళం పగలగొట్టి అందులో ఉన్న మూడున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. టూ టౌన్ ఎస్ఐ రాంబాబు సంఘటన చేరుకొని పరిసరాలను పరిశీలించారు. నల్గొండ నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్టు సీఐ నాగరాజు తెలిపారు.

పద్మమ్మ మృతిపట్ల సంతాపం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన పడమటి శ్రీనివాసరెడ్డి మాతృమూర్తి పడమటి పద్మమ్మ శుక్రవారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీ ఉంగ్రా భాగ్యమ్మ లింగారెడ్డి మాజీ సర్పంచ్ రాజు, కాంగ్రెస్ నాయకులు బండ సాగర్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి,జాన్ రెడ్డి,బొడిగే స్వామి ఉన్నారు.

జీతాలు ఇవ్వాలని వినతి

నవతెలంగాణ-మిర్యాలగూడ



జీతాలు ఇవ్వాలని మిషన్ భగీరథ కార్మికులు శుక్రవారం మిషన్ భగీరథ ఏఈ సింధుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ అధ్యక్షులు ధనావత్ వేణు మాట్లాడుతూ గతకొంత కాలంగా మిషన్ భగీరథ కార్మికులకు జీతాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 8 లోపు పెండింగ్లో ఉన్న మూడు నెలల జీతాలు ఇవ్వాలని లేని పక్షంలో ధర్నాకు దిగుతామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో కార్మికులు రవి నాయక్ నరేష్, బాషా, శివ, యల్లయ్య పాల్గొన్నారు.

కరాటే లో అంతర్జాతీయ పథకాలు సాధించిన చిన్నారులు

- అభినదించిన ఎంపీ రఘువీర్ రెడ్డి

నవతెలంగాణ-పెద్దవూర


మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు,యువ వ్యాపారవేత్త అయిన పాతన బోయిన సంతోష్ కుమార్ తనయుడు విహాస్ వైజాగ్‌లో జరిగిన 8వ అంతర్జాతీయ కరాటే పోటీలలో అండర్-9 విభాగంలో కటా విభాగంలో గోల్డ్ మెడల్, కుముతే విభాగంలో గోల్డ్ మెడల్ కలిసి రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు.సంతోష్ కుమార్ కుమార్తె సుదీక్ష అండర్ 10 విభాగంలో కటా విభాగంలో బ్రాంజ్ మెడల్ ,కుముతే విభాగంలో సిల్వర్ మెడల్ కలిసి రెండు మెడల్స్ సాధించారు.చిన్నప్పటి నుండి చదువులలో క్రీడలలో చురుగ్గా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి, మంచి పేరు తీసుకు రావడం గర్వకారణం అని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో అభినం దించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక దేహదారుఢ్యనికి దోహదపడుతాయన్నారు. అదే విధంగా యువ పారిశ్రామికవేత్త సంతోష్ కుమార్ ట్రైకూన్ మీడియా వారు నిర్వహించిన అవార్డు కార్యక్రమంలో తెలంగాణ బిజినెస్ ఇన్నోవేషన్ అవార్డు అందుకోవడం సంతోషాన్ని కలిగించిందని,ఇది ఎందరో యువ పారిశ్రామికవేత్తలకు ఆదర్శప్రాయంగా ఉంటుందని కొనియాడారు.



534.5 అడుగులుగా సాగర్ నీటిమట్టం

నవతెలంగాణ-నాగర్జునసాగర్

నాగార్జునసాగర్ జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను శుక్రవారం సాయంత్రానికి 534.50 అడుగులకు తగ్గింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం పై వాడిగా వేడిగా చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. సాగర్ జలాశయ నీటిమట్టం, నీటి నిల్వలు, సాగర్ లో ఉన్న నీటిలో ఎంత మేరకు వినియోగించుకునే అవకాశం, ఎగువ నుండి ఎంత మేరకు నీరు వచ్చే అవకాశం ఉంది, వేసవిలో హైదరాబాదు నగరానికి తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఏం చేయాలి అనే విషయాలపై ప్రభుత్వ యంత్రాంగం సంబంధిత జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్న తరుణంలో నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం, నీటి విలువలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో 312 టీఎంసీలకు గాను 177 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ జలాశయంలో కనీసముగా 510 అడుగుల నీటిమట్టం ఉన్నప్పుడు సాగర్ జలాశయంలో 131 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటుంది. ప్రస్తుతం సాగర్ జలాశయంలో 46 టీఎంసీల నీరు మాత్రమే వినియోగానికి అందుబాటులో ఉంది. ఎగువన శ్రీశైల జలాశయం నీటిమట్టం 790 అడుగుల వరకు విద్యుత్ ఉత్పత్తి ద్వారా, 705 అడుగుల నీటిమట్టం వరకు స్లూజ్ గేట్ల ద్వారా సాగర్ కు నీరు వచ్చే అవకాశం ఉంది. వేసవిలో రాష్ట్రంలో తాగునీటి కష్టాలు తీరాలంటే శ్రీశైలం ప్రాజెక్టు నుండి వచ్చే నీటిపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం నాగార్జున సాగర్ జలాశయం నుండి కుడి కాలువ ద్వారా 9188 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 3648 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 2000 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 280 క్యూసెక్కులు, జలాశయ విస్తీర్ణంలో ఆవిరైపోయిన 242 క్యూసెక్కులు మొత్తముగా 22559 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుండి విడుదలైన నీటిలో 4549 క్యూసెక్కులను రివర్స్ పంపింగ్ ద్వారా చేరు కుంటున్నాయి. ప్రస్తుతం ఎగువన శ్రీశైల జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు గాను 849. 80 అడుగుల నీటిమట్టం ఉంది. శ్రీశైల జలాశయ పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యంలో 215 టీఎంసీలకు గాను 79 టీఎంసీల నీరు మాత్రమే ఉంది.



లిటిల్ ఫ్లవర్‌లో శాస్త్ర వైజ్ఞానిక ప్రదర్శన



నవతెలంగాణ-మిర్యాలగూడ

పట్టణంలోని హౌజింగ్ బోర్డు లోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక తరగతుల చిన్నారులు జూనియర్ జీనియస్ పేరుతో శుక్రవారం స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్ అనే శాస్త్ర వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శన లో చిన్నారులు వివిధ రకాల మొక్కలు, వ్యవసాయ క్షేత్రాలు, అయోధ్య రామ మందిరం, తాజ్ మహల్, అగ్నిపర్వతం, ప్రముఖుల పేర్లతో స్టార్స్ ఆఫ్ ఇండియా, వాటర్ ప్యూరిఫికేశన్, డయాలసిస్, గ్రామర్ ట్రీ, జీర్ణ వ్యవస్థ, హైడ్రోపోనిక్, మూన్ ఫేస్, మానవ అస్థిపంజరం, సోలార్ ప్యానెల్, మానవ శరీర అంతర్భాగాల నమూనాలు, విండ్ వేన్, కాలుష్య నియంత్రణ వ్యవస్థ, రైతుల కష్టాలని, వివిధ రకాల విత్తనాలను, రైన్ వాటర్ హార్వెస్టింగ్, తెలుగు మాసాలు, సామెతలు, వివిధ గణిత నమూనాలను ,ఉద్యాన వనాలు ,ఇతర విషయాలపై నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు పాఠశాల పూర్వ విద్యార్థి డా. మురళీకృష్ణ, స్థానిక ఆర్ఎంపి, సంఘ సేవకులు, హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు డా. మునీర్ అహ్మద్ లు హాజరై మాట్లాడారు. ఇదే పాఠశాలలో చదువుకొని , ఆంగ్లం లో మంచి పట్టు సాధించి, ఒక డాక్టర్ గా మళ్లీ తను చదువుకున్న స్కూలు కు ముఖ్య అతిథిగా రావడం మనకు గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ కె. కె. జయరాజన్, హెడ్ మాస్టర్ సుజయ్ కుమార్ టి. ఎం. పాఠశాల డైరెక్టర్ జిన్సి జయరాజన్, పాఠశాల ఐటి విభాగాధిపతి యరగాని ప్రసాద్, ప్రైమరీ ఇన్చార్జి రాధిక తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను ఢీ కొట్టిన కంటైనర్

- ప్రమాదంలో వృద్ధుడు మృతి
- ఇద్దరికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

అతివేగంగా జాగ్రత్తగా కంటైనర్ డ్రైవర్ వాహనాలను ఢీ కొట్టగా ఒకరు మృతి చెంది, ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం పట్టణంలోని నందిపాడు బైపాస్ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణంలోని శరణ్య గ్రీన్ హొమ్స్ నివాసం ఉంటున్న పెట్నకోట భరతయ్య (83) తన ద్విచక్ర వాహనంపై నందిపాడు సమీపంలోని అద్దంకి నార్కెట్పల్లి రహదారి రోడ్డు దాటుతుండగా గుంటూరు నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన కంటైనర్ అదుపుతప్పి స్కూటీని బలంగా ఢీకొట్టింది. దీంతో భరతయ్య తలకు బలమైన గాయలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా కంటైనర్ అదుపుతప్పి అక్కడే పార్కింగ్ చేసి ఉన్న రెండు డీసీఎంలతో పాటు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ ధనుంజయకు స్వల్ప గాయాలు కాగా కంటైనర్ డ్రైవర్ కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సాయంతో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. దేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై రాంబాబు తెలిపారు.



జువైనల్ జస్టిస్ చట్టంపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-క్లాక్‌టవర్

నల్గొండ పట్టణంలో జిల్లా కోర్టు గల న్యాయ సేవా సదస్సు సెక్రెటరీ డి ఎల్ ఎస్ జస్టిస్ దీప్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమమును ఉద్దేశించి మాట్లాడారు జెమిని జస్టిస్ చట్టం 2017 అనేది 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లల అభ్యున్నతి రక్షణ మరియు నేర ప్రవర్తనకు సంబంధించిన ప్రత్యేక చట్టం నేరాల్లో పాలుపంచుకున్న బాల, బాలికలకు పునరావసం కల్పించి వారికి శిక్షకు బదులు మార్గదర్శనం చేసే న్యాయ వ్యవస్థ అందిస్తుంది తెలిపారు ఈ కార్యక్రమంలో ఉమెన్ పిఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కర్ణాకర్, సి డబ్ల్యూ సి నల్గొండ జిల్లా అధ్యక్షులు చింత కృష్ణ డాక్టర్ మోహన్‌రావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



గురుకుల డిగ్రీ కళాశాలలో గ్రంథాలయం ప్రారంభం

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల డిగ్రీ కళాశాల(బాలురు)లో గ్రంథాలయాన్ని శుక్రవారం నాడు ప్రారంభించారు. బిగ్ బ్రదర్ ఫౌండేషన్ సహ కారంతో సుమారు రూ.20 వేల గ్రంథాలయ సామగ్రి, రూ.10 వేలు విలువైన పుస్తకాలతో ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అలాగే మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం గురుకుల డిగ్రీ కళాశాలకు ఎన్ఎస్-ఎస్ యూనిట్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరు పత్రాన్ని ప్రధానాచార్యులు సి.హెచ్. మాధవీలత అందించారు. అనంతరం మాట్లాడుతూ దేశానికి, సమాజానికి సేవ చేయడంలో ఎన్ఎస్ఎస్ పాత్ర మరియు విద్యార్థుల ప్రాధాన్యతను గురించి వివరించారు. ప్రధానాచార్యులు సిహెచ్ మాధవీలత మాట్లాడుతూ కళాశాలకు గ్రంథాలయ సౌకర్యం చేకూరడం వలన విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు సద్వినియోగం చేసుకుంటారని, అలాగే ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరు అయినందున విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతతో పాటువ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన బిగ్ బ్రదర్ ఫౌండేషన్‌కి, ఫౌండేషన్ మెంబర్ శివ నాయక్, ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరు చేసిన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ టి పి హనుమంతు, లైబ్రేరియన్ అజయ్ చంద్ర , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రఘువీర్ కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



వాగులో పడి ఒకరి మృతి, మరొకరికి గాయాలు

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్



బైక్ అదుపు తప్పి వాగులో పడి ఒకరు మృతిచెంది, మరొకరికి తీవ్ర గాయాలు అయిన ఘటన సూర్యాపేట మండల పరిధిలోని కేసారం గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దురజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతరకు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా సూర్యాపేట మండల పరిధిలోని కేసారం గ్రామం సమీపంలోని వాగులో పడి కాసరబాధ గ్రామానికి చెందిన సుధీర్(21) మృతి చెందగా, సంపత్ (23)కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు.

అన్ని వర్గాలకూ అనుకూలమైన జాతర

నవతెలంగాణ-చిలుకూరు



అన్ని పార్టీల, కులాల, వర్గాలకు అనుకూలమైన జాతర కనకదుర్గమ్మ జాతర అని కాంగ్రెస్ మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బేతవోలు గ్రామంలో ప్రభబండ్లను ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని బేతవోలు గ్రామంలో 70 ,80 సంవత్సరాల నుండి కనకదుర్గమ్మ జాతరను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వనపర్తి రామారావు బేతవోలు పిఏసిఎస్ చైర్మన్ బజ్జూర్ రవీందర్ రెడ్డి, బజ్జూర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- పీఓ, ఏపీఓ, ఓపిఒ, ఎంఓలకు ఎమ్మెల్సీ ఓటింగ్‌పై శిక్షణా తరగతులు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



ఎన్నికల విధులను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఫిబ్రవరి 27న నిర్వహించబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పీఓ, ఏపీఓ, ఓపిఒ, మైక్రో అబ్జర్వర్‌లకు నిర్వహించిన శిక్షణలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న నిర్వహించడం జరుగుతుందని ఏ ఒక్కరికీ విధుల నుండి మినహాయింపు లేదని అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని, విధుల పట్ల ఎవరు అలసత్వం వహించరాదని హెచ్చరించారు. ఫిబ్రవరి 26న ఉదయం 7 గంటలకే సిబ్బంది అందరు బ్యాలెట్ పంపిణీ కేంద్రాలకి చేరుకోవాలని, అక్కడ తమకి కేటాయించిన పోలింగ్ కేంద్రంకు సంబంధించి ఓటర్ల జాబితా, అన్ని ఫారంలు, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లు, ఎలక్షన్ సామాగ్రి, ఇండెలీబుల్ ఇంక్ బాటిల్ లాంటివి అన్ని ఉన్నాయో లేవో జాగ్రత్తగా పరిశీలించి నిర్ధారణ చేసుకోవాలని లేకపోతె అధికారులకు తెలియపర్చాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి పిఒ, ఏపిఒ ఇద్దరు ఓపిఓలు అనే నలుగురు సిబ్బందిని కేటాయిస్తారని పిఓ పోలింగ్ కేంద్రానికి మొత్తం సూపర్‌వైజ్ చేయాలని, ఎపిఓ మార్క్‌డ్ కాపీకి ఇంచార్జిగా ఉంటూ పురుషులకి రెడ్ పెన్‌తో అండర్‌లైన్ గీయాలనీ, స్త్రీ ఓటర్లకి అండరు లైన్‌తో పాటు సీరియల్ నంబర్ టిక్ కొట్టాలని, థర్డ్ జెండర్‌లకి అండరు లైన్‌తో పాటు స్టార్ మార్క్ పెట్టాలని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ సూచించిన 16 డాక్యుమెంట్లలో ఏదైనా అనుమతించవచ్చు అని ఓటర్ ఓటర్ కార్డు తెస్తే ఈపీ అని, వేరే గుర్తింపు కార్డు తీసుకవస్తే చివరి 4 నెంబర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పోటీ చేసే అభ్యర్థి ముగ్గురు ఎజెంట్స్ ని నియమించుకోవచు కానీ ఒక్కసారి ఒక్కరికి మాత్రమే అనుమతి ఉంటుందని మరో ఇద్దరు బయట ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాతో కూడిన ఫారం 7బీ ని అతికించాలని ఉదయం 7:30 గంటలకు పోలింగ్ ఏజెంట్ లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించి వారి సమక్షంలో బ్యాలెట్ బాక్స్ ఖాళీగా ఉందని చూపించి ఏజెంట్స్ సంతకాలు తీసుకొని బ్యాలెట్ బాక్స్ సీల్ చేసి 8 గంటలకి పోలింగ్ మొదలు పెట్టాలని సూచించారు. ప్రతి 2 గంటలకి ఒక్కసారి పోలైన ఓట్లు సంఖ్యను పిఓ డైరీలో నమోదు చేసుకుంటూ ప్రిసైడింగ్ అధికారి పైఅధికారులకి తెలియజేయాలనీ సాయంత్రం 4 గంటలకి ఓటు వేయటానికి పోలింగ్ కేంద్ర ఆవరణలో ఓటర్లు క్యూలో నిల్చొని ఉంటే వారికి చివరి నుండి మొదటి వ్యక్తికి సీరియల్ ప్రకారం నెంబర్లు ఇవ్వాలని తెలిపారు. తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు మధ్యాహ్న సమయానికే వంద శాతం పోల్ అయినా కానీ సాయంత్రం 4:00 గంటల వరకు పోలింగ్ కేంద్రాలు మూసివేయకూడదని సాయంత్రం 4 గంటల తర్వాత ఎజెంట్స్ సమక్షంలోనే బ్యాలెట్ బాక్స్‌లు సీల్ చేసి ఎజెంట్స్‌కి ఫారం-16 ఇచ్చి ఎస్కార్ట్ ద్వారా పోలింగ్ రిసీవింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ఫారం 14 ద్వారా ఛాలెంజ్ ఓటు నమోదు చేయాలని, ఫారం 15 ద్వారా టెండర్ ఓటు నమోదు చేయాలని, విజిటర్స్ ఎవరైనా వస్తే వారితో సంతకం తీసుకోవాలని, అధికారులు ఖచ్చితంగా ఐ డి కార్డులు ధరించాలని,పోలింగ్ కేంద్రం లోకి మొబైల్, ఆయుధాలు అనుమతి లేదని కంపార్ట్మెంట్ ని వీడియో తీయకూడదని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. తదుపరి పీపీటీ ద్వారా ఎలక్షన్ ట్రైనర్స్ ఎన్నికల నిర్వహణ గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరిటీడెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు, ఎలక్షన్ ట్రైనర్స్ రమేష్, వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సోషలిజమే అజేయం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు

నవతెలంగాణ-కోదాడటౌన్

సోషలిజమే అజె యం మని పెట్టుబడి దారి విధానం పతనం ఖాయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ కేంద్రంలోని సుందరయ్య భవన్ లో ఫిబ్రవరి 21 రెడ్ బుక్ డే సందర్భంగా సీపీఐ(ఎం) 24వ మహాసభ రాజకీయ తీర్మానం, ముసాయిదా, సమీక్ష నివేదికపై నిర్వహించిన సామూహిక అధ్యయనం చర్చావేదిక కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచంలో దోపిడి, పీడన ,వివక్షత, అణచివేత, ఆర్థిక సమానతలు ఉన్నంతకాలం కమ్యూనిజం అజెయం గా నిలుస్తుంది అన్నారు. దేశ భవిష్యత్తును మార్చేది సోషలిజమే అంతిమ పరిష్కారం అన్నారు. ట్రంపు అమెరికా అధ్యక్షుడు అయ్యాక ప్రపంచ దేశాలపై ఆంక్షలు విధిస్తున్నారని అన్నారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్నారనే నెపంతో భారతీయులకు బేడీలు వేసి ఇండియాకు తీసుకురావడం సరికాదన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టి పల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ చర్చ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మిట్ట గనుపుల ముత్యాలు, బెల్లంకొండ సత్యనారాయణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, షేక్ సైదా, బచ్చలకూర స్వరాజ్యం, పార్టీ చిలుకూరు, కోదాడ రూరల్ మండల కార్యదర్శిలు నాగటి చిన్నరాములు, అలస గాని బ్రహ్మయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవారం వెంకటరెడ్డి, వి నారాయణ జుట్టుకొండ వీరయ్య, కుక్కడ పు నళిని, కోటేశ్వరరావు, శ్రీను, సంపతి పిచ్చయ్య, షేక్ సైదా హుస్సేన్, తిరుపతయ్య, కబీర్దాస్, సురభి లక్ష్మి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

డాబా పైనుండి పడి యువకుడు మృతి !

నవతెలంగాణ-హుజూర్ నగర్



హుజూర్నగర్ పట్టణానికి చెందిన తుమ్మలపల్లి సాయిరాం(33) హైదరాబాదులోని ఫిలిం ఇండస్ట్రీ నందు కెమెరామెన్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో వనస్థలిపురంలో నివాసం ఉంటున్నాడని ఎస్సై ముత్తయ్య తెలిపారు. తన స్నేహితుడు నవీన్‌తో కలిసి మిర్యాలగూడ పట్టణంలో తన మామ సోమ నాగరాజు ఇంటికి వెళ్లి అనంతరం హుజూర్నగర్‌లో నివాసం ఉంటున్న తన బావ ఓరుగంటి శ్రీనివాస్‌కు ఇంటికి రాత్రి పదిన్నర సమయంలో వచ్చి డాబా పైకి ఎక్కి మద్యం తాగుతుండగా ప్రమాదవశాత్తు సాయిరాం కింద పడడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడు. మృతుని తల్లి తుమ్మలపల్లి పద్మావతి తన కుమారుని మరణంపై అనుమానం ఉందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ కుటుంబ ఘర్షణకు జాతరకు సంబంధం లేదు

నవతెలంగాణ-చిలుకూరు



కాంగ్రెస్ వర్గపోరు ఘర్షణకు ఊరు జాతరకు ఎటువంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బేతవోలు గ్రామంలో జరిగిన కనకదుర్గమ్మ జాతరకు విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బేతవోలు గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మాణం చేసిన కనకదుర్గమ్మ జాతర ఆనాటి నుండి నేటి వరకు ఏనాడు జాతర ఆగిన దాఖలాలు లేవన్నారు. కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాలలో పౌరసరఫరాల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదిపత్యం చలాయిస్తున్న నియోజకవర్గాల అయినప్పటికీ ప్రతి గ్రామంలో కాంగ్రెస్ వర్గ పోరు నడుస్తుందన్నారు. కనకదుర్గమ్మ జాతర నిలిచిపోవడంతో అనేకమంది చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు నిరాశకు గురైనారున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అక్కినేపల్లి జానకి రామాచారి, బీఆర్ఎస్ మండల నాయకులు తాళ్లూరు శ్రీను, మాజీ మండల కో ఆప్షన్ ఎస్కే జానీమియా పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులకు సన్మానం

నవతెలంగాణ-హుజూర్‌నగర్ రూరల్



హుజూర్ నగర్ మదర్సా మదీనతుల్ ఉల్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి.అజీజ్ పాషా, ఎండి నిజాముద్దీన్‌లను మత గురువులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముఫ్తిషేక్ మొహమ్మద్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ ముస్లింమత పెద్ద ముఫ్తి మొహమ్మద్ గౌస్ ఉద్దీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ముస్లింల మతపెద్ద మౌలానా ముఫ్తి మహమ్మద్ ఏసనుద్దీన్ మాట్లాడారు. ఈ సమావేశానికి హాజరయ్యే వారు మానవాళి పట్ల గొప్ప గౌరవం మరియు సానుభూతిని పెంచుకుంటా రన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిమ్స్ మత పెద్దలు, గురువులు హజరత్ మౌలానా అన్వర్, మౌలానా అబ్దుల్ బారి ఫరూకీయ, మౌలానా మగ్దం సాహెబ్, మౌలానా అబ్దుల్ ఖాదిర్ సాహెబ్, ముక్తి ఆతహర్ సాహెబ్ కాష్మీ, షేక్ మొహమ్మద్,ముక్తి మహమ్మద్ గౌస్ ఉద్దీన్,అల్లాబక్షి, మహమ్మద్ ఖలీల్ సాబ్, మౌలానా ఉమర్ సాబ్, మౌలానా అబ్దుల్ రియాజ్ సాబ్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ఘనంగా వార్షికోత్సవ, వీడ్కోలు వేడుకలు



నవతెలంగాణ-తిరుమలగిరి

మండల కేంద్రం అనంతారంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం ప్రిన్సిపాల్ సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ, వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ ఇట్టమల్ల శాంతయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. అదేవిధంగా సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్‌గా బాధ్యత తీసుకున్న 5 నెలల్లోనే పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రిన్సిపాల్ పెద్దకోలా సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో మంచి హోదా గుర్తింపు రావాలంటే చదువే జీవితానికి మంచి విలువ అని అన్నారు. తిరుమలగిరి మండలంలో కళాశాల 2013లో స్థాపించిన నాటి నుండి నేటి వరకు అత్యుత్తమ ఫలితాలతో ఒక తిరుగులేని శక్తిగా పేరొందుతున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వైస్ ప్రిన్సిపల్ క్రాంతి కిరణ్, జమీల బేగం, వనిత రెడ్డి, మోహన్, సంగీత, స్వాతి, ఇందిర, ఎస్ కే. చాంద్ పాషా, సురేష్ కుమార్, భరతా చారి, జగన్ నాయక్, నర్సయ్య, మధుకర్, ప్రభాకర్,రాజు, చాంద్ పాషా, లక్ష్మయ్య, నస్రత్ సుల్తానా, వెంకటయ్య, జోసెఫ్, చైతన్య, పద్మ జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.



కృష్ణ నీళ్లు ఆంధ్రకు అక్రమంగా తరలింపు



- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్

నవతెలంగాణ-సూర్యాపేట

కృష్ణానది నీటిని అక్రమంగా ఆంధ్రకు తరలిస్తున్నా అసమర్ధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కండ్లున్న కబోదిలా ఉందని రాజ్యసభ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌కు వెయ్యి టీఎంసీల నీరు వస్తే అందులో 60శాతం ఆంధ్ర, 40శాతం తెలంగాణ వాడుకోవాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు పదివేల క్యూసెక్కుల నీటిని ఆంధ్రకు దొంగతనంగా తరలించారని ఆరోపించారు. వాళ్లకు రావాల్సిన నీటినే కాకుండా ఇంకా అక్రమంగా అదనంగా నీటిని తరలిస్తున్నప్పటికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు నోరు మెదపకపోవడం దౌర్భాగ్యమన్నారు. కృష్ణా జలాలను ఆంధ్ర అక్రమంగా వాడుకుంటున్నారని కేఆర్ఎంబి వద్ద ధర్నా చేస్తామని, ఢిల్లీకి వెళ్తామని హరీష్ రావు హెచ్చరించిన తర్వాత కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏడాదికి రెండుసార్లు నీళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. లిఫ్టుల ద్వారా లక్ష ఎకరాలకు, నాగార్జునసాగర్ ద్వారా 4:30 లక్షల ఎకరాలకు ఎస్ఎల్బీసీ ద్వారా రెండున్నర లక్షల ఎకరాలకు నీరు ఇచ్చామన్నారు. నాగార్జునసాగర్ వద్ద కేంద్ర బలగాలను తొలగించాలని పేర్కొన్నారు. శ్రీశైలం వద్ద ఆంధ్ర బలగాలు ఉంటే నాగార్జునసాగర్ వద్ద కేంద్ర బలగాలను ఉంచడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సారధ్యంలో సూర్యాపేట జిల్లా నుంచి జల పోరాటం మొదలవుతుందన్నారు. ఎస్సారెస్పీ రెండవ దశ ద్వారా ఆరేండ్లు నీళ్లు ఇచ్చామని ప్రస్తుతం నీళ్లు ఇవ్వకపోవడంతో తుంగతుర్తి, సూర్యాపేట ,మునగాల లో పంటలు ఎండిపోతున్నాయన్నారు. కృష్ణ జలాలు ఆంధ్రకు అక్రమ తరలింపును అడ్డుకోవడం తో పాటు రైతుల పంటలకు సకాలంలో నీళ్లు ఇచ్చి పంటలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ నెమ్మది బిక్షం, మాజీ జెడ్పిటిసి జిడి బిక్షం, ఆత్మకూర్ ఎస్ మండల అధ్యక్షులు తూడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు అభినందనీయం

- మండల విద్యాధికారి ఎండి.సలీమ్ షరీఫ్

నవతెలంగాణ-కోదాడ టౌన్



అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని మండల విద్యాధికారి ఎండి.సలీమ్ షరీఫ్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోదాడలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకల్లో కోదాడ ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి .సలీం షరీఫ్ పాల్గొని మాట్లాడారు. విషయ సమాచారం అవగాహన అర్థం చేసుకోవడం మాతృభాష ద్వారానే సులభమని, సాహిత్య సాంస్కృతిక వారసత్వ అభివృద్ధి మాతృభాష ద్వారానే జరుగుతుందన్నారు. పరభాష ఆంగ్లం వ్యామోహంలో తెలుగు మీడియం విద్యార్థులకు తెలుగు లో చదవడం, రాయడం రాకపోవడం శోచనీయమని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ తెలిపారు. రెండు రాష్ట్రాలలోని మాతృభాష తెలుగు భాష కమ్మదనాన్ని, తీయదనాన్ని, గొప్పదనాన్ని, దేశంలో ప్రాంతీయ భాషా ఉద్యమాలు, భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రాల తీరును పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఎం.వీర బ్రహ్మచారి, ఎం.చిన్నప్ప, ఎం.జానకిరామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటిక, జానపద నృత్యాలు, దేశభక్తి గేయాలు, కవితలు, పాటలు, పద్యాలు ఉపాధ్యాయులు విద్యార్థులను బాగా ఆకట్టుకున్నాయి. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు డిపార్ట్మెంట్ ఉపాధ్యాయులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి.సలీం షరీఫ్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ తెలుగు ప్రధాన ఉపాధ్యాయులు ఎం.వీర బ్రహ్మచారిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈ .శ్రీనివాస్ రెడ్డి వి. మీనాక్షి, ఎల్.దేవరాజు, బ్రహ్మానందం,కె. రామకృష్ణ బడుగుల సైదులు , ఎండి.ముక్తార్, రాణి , సునీల, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి



నవతెలంగాణ-హుజూర్‌నగర్ టౌన్

క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో రెడ్ బుక్ డే సందర్భంగా జరిగిన హుజూర్ నగర్, మఠంపల్లి, గరిడేపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల స్థాయి సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ, పట్టణ పేదలవాడలో ఇండ్లు, ఇండ్ల స్థలాల, రేషన్ కార్డుల సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తామని అంటున్నారని, వేలాదిమంది పేద ప్రజలు ఇల్లు లేక అల్లాడుతున్నారని, స్వంత స్థలం ఉన్న ప్రతి కుటుంబానికి ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. మిర్చికి క్వింటాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. షేక్ యాకూబ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం,వట్టేపు సైదులు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగెళ్ల వెంకటచంద్ర, పార్టీ మండల కార్యదర్శులు పోసనబోయిన హుస్సేన్, మాలోత్ బాలునాయక్ కందుల సుందరమౌళీశ్వర్ రెడ్డి, పాశం వెంకటనారాయణ, ఇందిరాల త్రివేణి, చిన్నం వీరమల్లు, తుమ్మల సైదులు, తుమ్మకొమ్మ యోన, జక్కుల వెంకటేశ్వర్లు, యానాల సోమయ్య, రేపాకుల వీరస్వామి, మదూరి నరసింహచారి, భిక్షం, బోయల అర్జున్, జగన్మోహన్ రెడ్డి, యరబోలు గోవిందరెడ్డి, మద్దూరి వెంకటరెడ్డి, గుండు సైదులు, యానాల ప్రమీల, పంగా వెంకటి, శీలం వెంకన్న, ముసిని శంభయ్య, చందాల బిక్షం, సిద్ధల వెంకటయ్య, దుగ్గి వేణు, మీసాల వీరబాబు, మోహన్ రెడ్డి, వెంకటేష్ నాయక్, సైదిరెడ్డి పాల్గొన్నారు.



ఫీజుల పేరుతో విద్యార్థులపై వేధింపులు అన్యాయం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దని యాకుల శ్రీకాంత్ వర్మ

నవతెలంగాణ-సూర్యాపేట

కళాశాలలో చేరేటప్పుడు విద్యార్థులతో చేసుకున్న ఫీజ్ ఒప్పందంకు భిన్నంగా, ఫీజులు చెల్లించాలని ఎస్వీ కళాశాల యాజమాన్యం విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దని యాకుల శ్రీకాంత్ వర్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్వి డిగ్రీ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కళాశాలలో పేద బలహీన వర్గాల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వీరంతా ప్రభుత్వం ఇచ్చే స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ మీద ఆధారపడి చదువుతున్నారని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థుల దగ్గరికి వెళ్లి కళాశాలలో జాయిన్ అవ్వండి ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలతో విద్యాబోధన జరుగుతుందని ఎలాంటి కళాశాల ఫీజులు మీరు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పి జాయిన్ అయ్యాక మాట మార్చడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం నుండి విడుదల కావలసిన ఉపకార వేతనాలు పెండింగ్లో ఉన్నాయని ఖచ్చితంగా విద్యార్థులు ఫీజులు చెల్లించాలని లేనిపక్షంలో పరీక్షలకు అనుమతించబోమని యాజమాన్యం విద్యార్థులకు నోటీసులు పంపించి విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు పరీక్ష ఫీజులు తప్ప కళాశాల ఫీజులు చెల్లించలేరని విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం చెల్లించినప్పుడు తీసుకోవాలని గతంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకుపోయిన కనికరం చూపించకపోవడం సరైంది కాదన్నారు. ఫీజుల విషయంలో ప్రశ్నించిన విద్యార్థులపై బెదిరింపు చర్యలను మానుకోవాలన్నారు. విద్యార్థులకు అందజేయాల్సిన స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ గత నాలుగు సంవత్సరాలుగా వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని తక్షణమే వాటిని ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి వినయ్, ఎస్వీ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్, దీపక్, రేణుక, ఓయూ విద్యార్థి సంఘం జేఏసీ నాయకుడు భారీ అశోక్, ఎస్ఎఫ్ఐ నాయకులు కీర్తి, దేవి ప్రియ,రాహుల్ సతీష్ అఫ్రోజ్, విగ్నేశ్వర్, శివ భరత్ నాగరాజు గణేష్, దామోదర్ పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతర ప్రశాంతం

విధులు నిర్వర్తించిన సిబ్బందికి ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అభినందనలు

నవతెలంగాణ-సూర్యాపేట



ఐదు రోజుల పాటు దురాజుపల్లిలో జరిగిన శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం, అవాంచనీయ సంఘటలు, నేరాలు, ప్రమాదాలు జరగకుండా కృషి చేశామని తెలిపారు. జాతరలో జిల్లా పోలీసు సిబ్బంది ముందస్తు ప్రణాలికతో పని చేశారని అభినందించారు. సూర్యాపేట సబ్ డివిజన్ డిఎస్పి రవి, సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్థానిక యసై మహేశ్వర్ లు ప్రణాళిక ప్రకారం పని చేశారని తెలిపారు. జిల్లా పోలీసు శాఖకు, జిల్లా యంత్రాంగానికి సహకరించిన భక్తులకు, ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు చెప్పారు. ఈ ప్రతిష్టాత్మకమైన జాతర నందు ప్రభుత్వం, పోలీసు ఉన్నతాదికారుల సూచనల ప్రకారం 2000 మంది పోలీసు సిబ్బందిచే మూడు విడతలుగా 24 గంటలు, ఐదు రోజుల పాటు బారి బందోబస్తు నిర్వహించడం జరిగిందని తెలిపారు. జాతర ప్రదేశంలో పోలీస్ కంట్రోల్ రూమ్ తో పాటు పోలీసు హెల్ప్ లైన్ సెంటర్స్ ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందించామని తెలిపారు.జాతర ముగిసినందున జాతీయ రహదారి 65 పై వాహనాలు యధావిధిగా వెళ్తాయని మళ్లింపులు అన్ని పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు.వాహనదారులు వేగంగా వెళ్లకుండా నిదానంగా వెళ్ళాలని కోరారు.

మహాశివరాత్రి వేడుకలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-సూర్యాపేట

శ్రీ సత్య సాంబశివ స్వామి వారి మహాశివరాత్రి వేడుకలను ఈనెల 24 నుండి 27 వరకు నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు సంతోషిమాత దేవాలయం అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త బ్రాహ్మండ్లపల్లి మురళీధర్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీ సంతోషిమాత దేవాలయ ఆధ్యాత్మిక గ్రంథాలయంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకల ప్రచార కరపత్రాన్ని కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మహాశివరాత్రి వేడుకలను సంతోషిమాత దేవాలయంలో అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఈ నెల 24 సోమవారం ఉదయం 10:15 నిమిషాలకు కలశ స్థాపనతో ప్రారంభమై ఉదయము, సాయంత్రం రుద్రహోమం ఈనెల 25 మంగళవారం ఉదయం, సాయంత్రం రుద్ర హోమం 26 బుధవారం మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 6 గంటల నుండి 12 గంటల వరకు శ్రీ సత్య సాంబశివ స్వామి వారికి పంచామృతలతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు వివరించారు. మార్చి ఒకటి నుండి మూడు వరకు సంతోషిమాత దేవాలయంలో నూతన జీవధ్వజ పునర్ ప్రతిష్ట కార్యక్రమం కూడా అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిష్ట కార్యక్రమానికి పుష్పగిరి పీఠాధిపతి అభినవోదండ విద్యా భారతి స్వామి కర కమలములచే ప్రతిష్టా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మకమిటీ సభ్యులు కొత్త మల్లికార్జున్, తాళ్లపల్లి రామయ్య, బెలిదే అశోక్, బ్రాహ్మండ్లపల్లి మనోహర్ గుప్త, యామా వెంకటేశ్వర్లు, దేవరశెట్టి సోమయ్య, పూస నాగయ్య, భక్తులు బొమ్మిడి పద్మ, బచ్చు నీరజ, చాపల శైలజ, నిమ్మల రేణుక, ఓరుగంటి జగదీశ్వరి, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

'ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి'

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

మండల పరిధిలోని ఏపూరు, రామన్నగూడెం, ముక్కుదేవులపల్లి, మక్తా కొత్తగూడెం నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, దీనిని వెంటనే అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం ఆత్మకూరు ఎస్ మండల తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఏపూరు, రామన్నగూడెం, ముక్కుదేవులపల్లి మక్తా కొత్తగూడెం ఏటి నుండి ఇసుకను ఆక్రమణదారులు రాత్రి వేళలో దొంగ చాటుగా తరలిస్తూ, అక్రమ దందాలకు పాల్పడుతున్నారని, అడిగిన వారిని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే మండల తహసిల్దారు, ఎస్ఐ వెంటనే ఇసుక అక్రమ రవాణా దారులపై చర్యలు తీసుకోవాలని



కోరారు. లేని యెడల సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పేర్ల నాగయ్య, డివిజన్ నాయకులు ఎస్కే గులాం హుస్సేన్, మాసిరెడ్డి నవీన్ రెడ్డి,సామ సత్తిరెడ్డి, సామ మల్లారెడ్డి, గోగుల వీరబాబు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
యాదాద్రి భువనగిరి
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

పార్థివ దేహానికి నివాళి, ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్



యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట శుక్రవారం, కాశీం పాషా అనారోగ్యంతో చనిపోయారు.మాజీ వార్డు సభ్యులు కళ్లెం విజయ జహంగీర్‌గౌడ్ పార్థివదేహానికి నివాళులర్పించారు.వారి కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సంతాపం తెలిపి, వారు తమ సొంత నిధులతో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యేమాల ఏలేందర్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నసీరుద్దీన్, గ్రామశాఖ అధ్యక్షులు పాండవుల సత్య ప్రకాష్, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ఇమామ్ పాషా, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి.యాకుబ్ అలీ, మాజీ వార్డు సభ్యులు ఎండి ఉస్మాన్, మిల్క్ సెంటర్ చైర్మెన్ సుంచు ఈదయ్య, కబీర్, తోటకూరి యాకయ్య, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహా వేడుకలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-బొమ్మలరామారం

బొమ్మలరామారం మండల బీజేవైఎం నాయకులు చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన గుర్రం ప్రవీణ్‌రెడ్డి,దివ్య రెడ్డి వివాహం శుక్రవారం అవుషాపూర్ గ్రామంలోని రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది.వివాహ వేడుకలో పలువురు నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, గొంగడి మహేందర్‌రెడ్డి, పడాల శ్రీనివాస్, పలువురు మండల నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు టెన్త్ పరీక్షలు

- పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి
- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



మార్చి 21వ తేదీ నుండి ఏప్రిల్ 4 వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహి ంచాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీమీటింగ్ హాలులో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.ఈ పరీక్ష కోసం జిల్లాలో 50 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 8,631 మంది విద్యార్థి, విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు.పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం12.30 నిమిషాల వరకు జరుగుతాయని తెలిపారు.విద్యార్థులు ఉదయం 8.30గంటల వరకే పరీక్షాకేంద్రానికి చేరు కోవాలన్నారు..సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపులో అత్యంత భద్రత తీసుకోవాలన్నారు.విద్యార్థులు సమయానుకూలంగా పరీక్షాకేంద్రాలకు చేరే విధంగా ఆర్టీసీబస్సులు నడపాలని, నిరంతరం పరీక్ష కేంద్రాలలో విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ పరిధిలో, ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షాకేంద్రాల్లో శానిటేషన్ అన్ని పరీక్షాకేంద్రాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్లను,వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు.పరీక్షాకేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రశ్నాపత్రాల కవరు సీలు తీయడం, జవాబుపత్రాలను కవరులో ఉంచి సీలు వేయడం సీసీకెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. పరీక్ష అయిపోయిన తదుపరి జవాబుపత్రాలు సరిగా పార్సెల్ చేసి డీఆర్డీసీకి ఎస్కార్ట్ ద్వారా జాగ్రత్తగా తీసుకెళ్లాలన్నారు. మొబైల్ ఫోన్‌కు అనుమతి లేదన్నారు.పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ పరీక్షాకేంద్రాలలో ఆకస్మికంగా సందర్శిస్తూ పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఏసీపీ రమేశ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రోజారమణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, జిల్లా ట్రెజరీ అధికారి సంపూర్ణ,మున్సిపల్ కమిషనర్ రాజలింగం,జిల్లా వైద్య అధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'నవతెలంగాణ' ఎఫెక్ట్

- ధరణి ఆపరేటర్ విధుల నుంచి తొలగింపు
- అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన,కొనుగోలు చేసిన వ్యక్తులపై చర్యలకు కలెక్టర్ ఆదేశాలు
- బాధ్యులైన ఇతర ఉద్యోగులపై చర్యలు
- ధరణిలో యూసుఫొద్దీన్ పేరుపై భూమి యథాతథం



నవతెలంగాణ-గుండాల

'గుండాలలో భారీ భూ స్కాం' పై వచ్చిన వార్తకు స్పందించిన కలెక్టర్ ధరణి ఆపరేటర్ ఎన్.రాజును విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.గుండాల రెవెన్యూ శివారులోని 177 సర్వే నెంబర్‌లోని మహమ్మద్ యూసుఫోద్దీన్ పేరున గల 9 ఎకరాల 17 గుంటల భూమిని అతని వారసులకు తెలియకుండా ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తి సయ్యద్ ఇబ్రహీం, కొనుగోలు చేసిన వ్యక్తులు మాదరబోయిన నర్సింహులు,మంద మహేశ్వరిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలు జారీ చేశారని తహసీల్దార్ జలకుమారి తెలిపారు.బాధ్యులైన ఇతర ఉద్యోగులపై చర్యలు ఉంటాయన్నారు.ధరణిలో చనిపోయిన వ్యక్తి మహమ్మద్ యూసుఫోద్దిన్‌పై భూమి యథాతథంగా నమోద చేశామన్నారు.పూర్తిస్థాయిలో విచారణ జరిపించి త్వరలో కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు.



కొనసాగుతున్న మహా కుంభాభిషేక సంప్రోక్షణ ఉత్సవాలు

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సువర్ణ దివ్యవిమాన రాజగోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.శుక్రవారం మూడో రోజు ఉత్సవాల్లో భాగంగా నిత్య ఆరాధనల అనంతరం శ్రీ వనమాలై మఠం 31వ మధురకవి రామానుజజీయర్ స్వామి పర్యవేక్షణలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఉత్సవాల్లో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.హైదరాబాద్ చెందిన హర్షవర్ధన్ బండారితో భక్తిసంగీతం షాన్కారి నాట్యస్థల్ హైదరాబాద్‌తో కూచిపూడి నృత్యం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త నర్సింహామూర్తి, ఈఓ ఏ.భాస్కర్‌రావు, ఆలయ ప్రధానఅర్చకులు. ఉప ప్రధాన అర్చకులు అధికారులు పాల్గొన్నారు.



నేడు కందాల రంగారెడ్డి 40వ వర్ధంతి సభ

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు గ్రామ శాఖ సమావేశం శుక్రవారం నిర్వహించారు.కందాల రంగారెడ్డి 40వ వర్ధంతి మహాసభ నేడు మందోల్లగూడెం గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని కొండె శ్రీశైలం తెలిపారు.సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా అభివృద్ధి జరగలేదన్నారు.కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు.రైతుభరోసా పథకాన్ని తక్షణమే రైతుల ఖాతాలో జమ చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి కొండే శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ చెన్నబోయినవెంకటేశం, సప్పిడి రాఘవరెడ్డి, ఇట్టబోయిన శేఖర్, మానే శాలయ్య, యాట ముత్యాలు, మంద బుచ్చిరెడ్డి,కొండే అంజయ్య,పాపగళ్ళ శంకరయ్య, కస్తూరి లింగస్వామి, పాపగళ్ళ లింగస్వామి, కూరేళ్ల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాకు తరలిపోతున్న నీటి కోసం ఎందుకు ప్రశ్నించరు?

- సీఎం సహకరించకపోతే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసే పోరాటాలకు అండగా ఉంటాం
- తెలంగాణ జలాల వాటాల హక్కులను కాపాడాలి
- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత

నవతెలంగాణ-భువనగిరి



నదీ జలాల వాటలో అక్రమముగా తెలంగాణ వాటాను ఇవ్వకుండా ఆంధ్రాకు తరలించకపోతున్న నీటిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదు. అక్రమ నీటి తరలింపుకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాటం చేయాలని బీఆర్‌ఎస్ నాయకురాలు,ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో అనుకూలమైన పాలకులు లేకున్నా కేసీఆర్,హరీష్‌రావులు తెలంగాణకు రావాల్సిన నీటి జలాలవాటాపై పోరాటం చేశారన్నారు.గోదావరి జలాలను సంపూర్ణంగా వాడుకోవడానికి కర్ణాటక, మహారాష్ట్రతో మాట్లాడి ఒప్పించారని కొనియాడారు. కృష్ణాజలాలపై ప్రాజెక్టులు కట్టడానికి పలు విజ్ఞప్తులు చేసిన మేరకు కొన్ని మినహాయించి మిగతాదంతా అనుమతులు వచ్చాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తినే కంచంలో మట్టిపోసుకుంటున్నారని విమర్శించారు.ఆర్థికవనరులు సమకూర్చే వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు.కృష్ణాజలాల వాటాపై ప్రశ్నించకపోతే రైతులకు నీటిసౌకర్యంతో పాటు హైదరాబాద్ తాగునీటి కూడా కష్టం వస్తుందన్నారు. తెలంగాణకు వాటా ఇవ్వకుండా ఆంధ్రాకు అక్రమంగా నీటిని తరలించకపోతున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబునాయుడికి గురుదక్షిణగా ఆంధ్రాకు నీటి తరలింపునకు సహకరిస్తున్నాడని ఆరోపించారు.ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉండి నలగొండ బిడ్డ అయిన ఉత్తంకుమార్‌రెడ్డికి, సీఎంకే సోయి లేకుండాపోయిందన్నారు.నీరు లేక గతంలో నల్గొండ ఉమ్మడి జిల్లా ఎంతకు గోసకు గురైందో ఉత్తంకుమార్ రెడ్డికి తెలిసిందే కదా అని గుర్తు చేశారు. రేవంత్ నిర్లక్ష్యం చేస్తుంటే ఉత్తంకుమార్‌రెడ్డి ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఒకవేళ సహకరించకపోతే నదీజలాల కోసం ఉత్తంకుమార్‌రెడ్డి పోరాటం చేస్తే తమ పార్టీ ఆ పోరాటంలో పాలుపంచుకుంటుందన్నారు. తెలంగాణకు 123 టీఎంసీల నీటి వాటా పెండింగ్‌లో ఉందన్నారు ఆ నీటిని నాగార్జునసాగర్ కు తరలించి నలగొండ ఖమ్మం మహబూబ్నగర్ నీటి కష్టాలు తీర్చాలన్నారు. నదీ జలాల వాటను వినియోగించకపోతే మీకు మీ ప్రభుత్వానికే కాక రాష్ట్ర ప్రజలు తీవ్ర నష్టపోతారని తెలిపారు. నవంబర్ 30 వరకు రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న నీటి పంపిణీ కేంద్ర ప్రభుత్వంలోకి వెళ్లిపోయిందన్నారు.సీఆర్‌పీఎఫ్ మొహరించి ఉన్నారని తెలిపారు. ఆ ధైర్యంతోనే ఆంధ్రా ప్రభుత్వం అక్రమంగా డెత్ స్టోరేజీ ఉన్నప్పటికీ నీటిని తరలించకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు కేంద్రంపై పోరాటం చేయాలన్నారు.నీటి జలాలపై కాంగ్రెస్‌కు ప్రశ్నించే దమ్ము లేదని, బీజేపీకి ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాలువల ద్వారా నీటిని సరఫరా చేస్తూ ఆలేరు ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. భువనగిరి ఎమ్మెల్యేకు నీటి జలాలపై కనీస అవగాహన లేదని ఆరోపించారు.భువనగిరి మండలం తిమ్మాపురం గ్రామ ప్రజలు తమకు రావాల్సిన నష్టపరిహారం అందిస్తే ఊరిని ఖాళీ చేస్తామని ముందుకొచ్చినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు.అందుకు సంబంధించిన నిధులు కలెక్టర్ దగ్గర ఉన్నాయని, వాటిని గ్రామస్తులకు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మెన్ పెంట నర్సింహ, మాజీ ఎంపీపీ సుబ్బూరు బీరు మల్లయ్య నాయకులు జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రపంచానికి దిశా నిర్దేశం చేసేది మార్క్సిజమే

- పీఎస్ అధ్యయన వేదిక కన్వీనర్ కల్లూరి మల్లేశం



నవతెలంగాణ-భువనగిరి

నేడు పెట్టుబడిదారి విధానంతో ప్రపంచం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందని దీనికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్ట్ సిద్ధాంతమేనని పుచ్చలపల్లి సుందరయ్య అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ కల్లూరి మల్లేశం అన్నారు.శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో రెడ్ బుక్ డే సందర్భంగా సామూహిక పుస్తక పఠనం నిర్వహించారు.ఈ సంద ర్భంగా వారు మాట్లా డుతూ కారల్‌మార్క్స్, ఎంగెల్స్ రాసిన కమ్యూనిస్ట్ ప్రణాళిక ముద్రించిన రోజు ఫిబ్రవరి 21 అని,ఈ రోజును రెడ్ బుక్‌డేగా ప్రపంచమంతా నిర్వహి స్తున్నారని తెలియ జేశారు. ఆర్థికసంక్షోభానికి కారణాలను కనుక్కోవడం కోసం పెట్టుబడిదారీ దేశాల పాలకులు కారల్‌మార్క్స్ రాసిన దాస్ కాపిటల్ పుస్తకాలను చదువుతూ పరిష్కా రాలను వెతుకుతున్నారని తెలియజేశారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభం పెరుగుతున్న కమ్యూనిస్ట్ లు అధికారంలో ఉన్న చైనా లాంటి దేశాలు అభివృద్ధి వైపు సాగుతున్నాయని పెట్టుబడి దారి విధానానికి ప్రత్యామ్నాయం మార్క్సిజమేనన్నారు.రైతుల పొట్ట కొట్టే నల్ల చట్టాలను తీసుకురావడం, జాతీయ విద్యావిధానాన్ని బలవంతంగా విద్యార్థులపై రుద్దడం, రోజురోజుకు మహిళలపై దాడులు పెరగడం ,వ్యవ సాయం దెబ్బతినడం వీటన్నింటికీ మూల కారణం పాలక ప్రభుత్వాల పెట్టుబడి దారి దివాళాకోరు విధానాలే నన్నారు.ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజుగౌడ్, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్,కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, దయ్యాల నర్సింహ, ప్రజాసంఘాల నాయకులు ఈర్లపల్లి ముత్యాలు, లావుడియా రాజు, బోడ భాగ్య, వనంరాజు,ఓవల్దాసు అంజయ్య, వల్లపుదాసు రాంబాబు పాల్గొన్నారు.

24 గంటల వైద్య సేవలందించాలని వినతి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

పోచంపల్లి మండలకేంద్రంలో 50 పడకల ప్రభుత్వాస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆపార్టీ మండల, పట్టణ కార్యదర్శులు కోట రామచంద్రారెడ్డి,దుబ్బాక జగన్ మాట్లాడారు.ప్రపంచంలోనే అత్యంత పేరు ప్రఖ్యాతలు నిత్యం పర్యాటకులతో సందడిగా ఉండే పోచంపల్లి మండలకేంద్రంలో కనీసం అత్యవసర వైద్య సేవలు లేవన్నారు.పోచంపల్లి మండలకేంద్రంలో ప్రభుత్వాస్పత్రిలో ప్రస్తుతం ఆరు పడకలు మాత్రమే ఉన్నాయని వైద్యులు సాయంత్రం సమయంలో అందుబాటులో ఉండకపోవడం వల్ల అత్యవసర వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. పోచంపల్లి లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండకపోవడం వల్ల మండలవ్యాప్తంగా ఉన్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ హైదరాబాద్‌కు ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి రూ.లక్షలు దారపోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గసభ్యులు మంచాల మధు, పట్టణ కమిటీ సభ్యులు బుగ్గలక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, నాయకులు జంగారెడ్డి,రాజు తదితరులు పాల్గొన్నారు.



పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతాం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు-సిద్దిపేట ప్రధానపట్టణాల మధ్య కొలనుపాక గ్రామ సమీపంలో పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణపనులు త్వరలోనే చేపడుతామని, ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య అన్నారు.శుక్రవారం 'నవతెలంగాణ'తో ఆయన మాట్లాడారు.ఇటీవల సాగు నిమిత్తం ఆలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు పెద్దవాగు ద్వారా నీటిని వదిలిపెడుతూ నీళ్ల ఐలయ్యగా పేరు పొందిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వాగు వద్ద వరద ఉధృతి వల్ల ఇటీవల జరుగుతున్న ప్రమాదాల గురించి నవ తెలంగాణ దినపత్రిక రిపోర్టర్ యేలుగల కుమారస్వామి వివరించారు. ప్రమాదాల నివారణకు కంచె ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ త్వరలోనే బ్రిడ్జి నిర్మాణపనులు ప్రారంభిస్తామన్నారు.ప్రస్తుతం నీటి వరద ఉధృతి తగ్గిందని చెప్పారు. ప్రయాణికులు, వాహనదారుల కష్టాలు రూపుమాపుతామన్నారు.

పౌష్టికాహారం అందించాలి

నవతెలంగాణ-భువనగిరి

పౌష్టికాహారం అందించడం వల్లే పిల్లలు ఆరోగ్యంతో పాటు చైతన్యంగా ఉంటారని టీపీసీసీ డెలిగేట్ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్ అన్నారు.శుక్రవారం ఆర్బీనగర్ ప్రెసిడెన్సీ విద్యాలయంలో విద్యార్థి తల్లిదండ్రులకు నిర్వహించిన పౌష్టిక ఆహారం ఆరోగ్యం ఎదుగుదల అవగాహనా సదస్సులో పాల్గొని మాట్లాడారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. విద్యాలయ ఏర్పాటు వ్యాపారకేంద్రంగా చూడవద్దని, సామాజిక స్పృహతో పనిచేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద మధ్య తరగతి విద్యార్థులు ఉంటారని వారి నుండి కార్పొరేట్ పాఠశాల మాదిరిగా డబ్బులు వసూలు చేయొద్దని కోరారు. విద్యార్థులకు జంక్‌ఫుడ్స్, ఫాస్ట్‌ఫుడ్ తినిపించవద్దన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సుహాసిని, జయలక్ష్మి, జయపాల్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర నాయకులు తాహేర్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ముల్తానీషా (ముత్తు). బండి దానయ్య.. నాయకులు కూర శివ, మాటూరు కృష్ణ, మాచర్ల వినయ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ నుండి నవీన్‌రెడ్డిని బహిష్కరణ

నవతెలంగాణ-మోటకొండూరు

వారం రోజులుగా ఎమ్మెల్యే మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్ విలువలను దిగజార్చుతున్న అనంతుల నవీన్‌రెడ్డిని శుక్రవారం మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్ పార్టీ నుండి బహిష్కరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పచ్చిమట్ల మధార్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ కొంతం మోహన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు బోయిని ఝాన్సీ, యూత్‌కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు జూకంటిమధు, భూమండ్ల శ్రీనివాస్, బుగ్గకొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ రేగు శ్రీనివాస్, వంగాల మల్లేష్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి నుండి గజ్వేల్ ప్రజ్ఞాపురం వెళ్లే రహదారిపై గుంతలను పూడ్చాలి

నవతెలంగాణ-భువనగిరి



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం నుండి జగదేవ్‌పూర్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, సిద్దిపేట ప్రాంతాలకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి దయ్యాల మల్లేష్ శుక్రవారం డిమాండ్ చేశారు.నిత్యం అనేక జిల్లాల నుండి భువనగిరి మీదుగా గజ్వేల్, ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, జగదేవ్పూర్ ప్రాంతాలకు వందల వాహనాలు ప్రయాణం చేస్తుంటాయన్నారు.అనేకమంది ప్రయాణికులు రోడ్డు గుంతల మయంగా ఉండడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉన్నదని, అనేకసార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు ఈ విషయంపై విన్నవించిన కనీసం స్పందన లేదన్నారు.ఇదే రహదారి వెంట హనుమాపురం, వడపర్తి, తుర్కపల్లి, ఇతర గ్రామాలకు వెళ్లడానికి సులువైన మార్గం అనేక మంది ప్రయాణికులు ఈ రహదారిలో ప్రమాదానికి గురై వికలాంగులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు.అయినా పాలకులలో స్పందన లేదన్నారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, ఎండి సాజిద్, ఎండి నేహాల్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

నవతెలంగాణ-రామన్నపేట



రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం, స్థానిక సంస్థల్లో నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసంఉద్యమించాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనం ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంతో పాటు వెల్లంకి గ్రామంలో ఎన్‌పీఆర్డీ 15వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రామన్నపేట మండల గౌరవ అధ్యక్షులు బొడ్డుపల్లి వెంకటేశం, మండల ఉపాధ్యక్షులు నాగు నరసింహ, మండల నాయకులు పున్న శ్రీధర్, నోముల రవివర్మ, శివ, ఉదయ్, బీరప్ప, మల్లమ్మ, కునూరువెంకటేశం,కె.శ్రీను, నర్సింహ, వెల్లంకి గ్రామ నాయకులు తాటిపాముల జంగయ్య, ఆవనగంటి నగేష్, గూని నర్సింహ, జెల్లా ఉపేందర్, జెల్లా శ్రీరాములు, మూడ నర్సమ్మ, మూడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షాసామగ్రి అందజేత

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం మహమ్మద్ అమీన్‌మెమన్ సహకారంతో పరీక్షల ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గంద్ర శ్రీకాంత్,పేరెంట్స్ కమిటీ చైర్మెన్ డాక్టర్ షేక్.హమీద్ పాషా, ఇక్బాల్ చౌదరి, మహమ్మద్ అబ్రార్, వైస్ ప్రిన్సిపాల్ మందారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, నవీన్‌కుమార్, యాదయ్య, పాండు, లక్ష్మయ్య, సైదులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

నవతెలంగాణ-భువనగిరి

మార్చి 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్‌హాల్లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులతో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరముల వార్షిక పరీక్షలు 2025 మార్చి 5వతేదీ నుండి మార్చి25వ తేదీ వరకు జరుగుతా యన్నారు. జిల్లాలో 29 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు రాసేందుకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 6208 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6350 మంది మొత్తంగా 12558 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాను న్నారన్నారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షల నిర్వహణకు ఉదయం 8గంటల వరకే విద్యార్థులు పరీక్షాకేంద్రానికి చేరుకోవాలన్నారు.సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపులో అత్యంత భద్రత తీసుకోవా లన్నారు.విద్యార్థులు సమయానుకూలంగా పరీక్షా కేంద్రాలకు చేరే విధంగా ఆర్టీసీబస్సులు నడపాలని, నిరంతరం పరీక్షాకేంద్రాలలో విద్యుత్తుసరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ పరిధిలో, ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటి ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షాకేంద్రాల్లో శానిటేషన్, ఫస్ట్ ఎయిడ్ కిట్లను,వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచా లన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షాకేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించా లన్నారు.విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఏసీపీ రమేష్,జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రోజారమణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, జిల్లా ట్రెజరీ అధికారి సంపూర్ణ,మున్సిపల్ కమిషనర్ రాజలింగం,జిల్లా వైద్య అధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాజపేటకు సాగునీరు అందించాలి

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం ఎడారిగా మారకముందే ప్రజలు రైతులు నష్టాలపాలై వలసలు వెళ్లకముందే కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ముస్లిం సోదరులు కోరారు. శుక్రవారం రాజపేట మసీదులో ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనలు చేశారు అనంతరం మసీదు కార్యదర్శి తయ్యాబలి, సలావుద్దీన్ లు ముస్లిం సోదరులతో కలిసి మాట్లాడారు. రైతులు గొర్రెలు, మేకల పెంపకందారులు ప్రజలు సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని వివరించారు. కాల్వపల్లి వాగు నుండి నీరంతా వృథాగా పోతుందన్నారు.మండలానికి సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు. జీవాలకు కూడా నీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తయ్యాబలి, సలావుద్దీన్, శ్యామ్యాజ్, ఉస్మాన్, అస్సు, జహంగీర్, తాకీర్, కలీం, అహ్మద్, జాంగిర్, రాజపేట మండల పట్టణ మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆత్మకూరుఎం

వేసవికాలం సమీపించడంతో మండలంలోని అన్ని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలని ఎంపీడీవో రాములునాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవోకార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ లోకేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మేహార్‌సాయి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇప్పర్తి ఉర్సు ఉత్సవాలలో వట్టికోటి శేఖర్

నవతెలంగాణ-మునుగోడు



మండలంలోని ఇప్పర్తి గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాలలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వట్టికోటి శేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కులమతాలకు అతీతంగా నిర్వహించే ఉర్సులో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని లక్ష్యంతో అహర్నిశలు కృషి చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రివర్గ విస్తరణ లో మంత్రి పదవి రావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మండలంలోని మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు , ప్రజా ప్రతినిధులు , యువకులు తదితరులు ఉన్నారు.

అప్పన్నపేట, గడ్డిపల్లిలో దొంగతనం

బంగారం, నగదు చోరీ

నవతెలంగాణ-గరిడేపల్లి

మండల పరిధిలోని అప్పన్నపేట గడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం దొంగతనం జరిగింది. ఈ రెండు గ్రామాల్లో కొద్ది సమయం వ్యవధిలోనే చోరీ జరగడం విశేషం. స్థానికులు అందించిన సమాచారం మేరకు పల్సర్ బైక్ పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఈ దొంగతనానికి పాల్పడ్డట్లు తెలిసింది. అప్పన్నపేట గ్రామంలో సోమ గాని లక్ష్మి ఇంటి వెనకనుంచి లోపలికి వెళ్లి బీరువా పగలగొట్టి 17 గ్రాముల బంగారం, 10 తులాల వెండి పట్టీలు, 50 వేల రూపాయలు నగదును దొంగతనం చేశారు. గడ్డిపల్లి గ్రామంలో కర్ణం నగేష్ ఇంట్లో రెండున్నర తులాల బంగారం, దొంగతనం చేశారు. అదే గ్రామానికి చెందిన కోణం వేణు రూ.36,000 నగదు దొంగతనం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గరిడేపల్లి ఎస్సై చలిగంటి నరేష్ తెలిపారు.

కార్మికులు సభ్యత్వాలను నమోదు చేయించుకోవాలి

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి.పాషా

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో ఆటో కార్మికుల సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆటో కార్మికులు ట్రాన్స్పోర్ట్ సంబంధించిన కార్మికుల సభ్యత్వాలను నమోదు చేయించారు.ఈ సందర్భంగా ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి.పాషా మాట్లాడుతూ ట్రాన్స్పోర్టు కార్మికులు కలిసికట్టుగా ఉండి తమ హక్కుల్ని తాము సాధించుకోవాలని తెలిపారు.కార్మికసంఘాలు పెట్టి సంఘాలలో పనిచేసుకుంటూ డిసిప్లేన్‌గా ఉండి తమ హక్కులను సాధించుకోవాలనిసూచించారు.ట్రాన్స్పోర్టు కార్మికుల సమస్యలపైన మార్చి 23న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరుగు ధర్నాను పెద్దఎత్తున కదిలిరావాలని తెలిపారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్,ట్రాన్స్పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు మాంద్రకోటయ్య ప్రజాసంఘాల నాయకులు చింతల సుదర్శన్,మాంద్ర శ్రీను, డొప్ప అంజయ్య, సిహెచ్ మహేష్,పి.మహేశ్, డి.మధుసూదన్,చెక్క నవీన్,చెక్క సాయికుమార్, బక్క రవికుమార్, బాసరాజు సాయికుమార్,ఘర్ష లింగస్వామి, ఎస్కె.ఇబ్రహీం, మీసాల నర్సింహ, తీగుళ్ల లింగయ్య, నూనె కృష్ణ, బి.భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఆహారంలో అయోడిన్, ఐరన్ ఉండేలా చూసుకోవాలి

నవతెలంగాణ-భువనగిరి



మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ ఐరన్ పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. మనోహర్ విజ్ఞప్తి చేశారు శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం రెండో రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అయోడిన్ పోషకాహార లోపం వల్ల,ఐరన్ లోపం వల్ల గర్భిణులకు పిల్లలకు కౌమారదశలో ఉన్న వారికి ఆరోగ్యానికి ఆందోళన కలిగిస్తుందన్నారు.ఐరన్ లోపం వలన గాయిటర్, క్రెటినిజం, థైరాయిడ్, న్యూరోమేటర్ లోపాలు,గర్భిణుల్లో తరచుగా అబార్షన్లు జరుగుతాయన్నారు. పిల్లలలో మందబుద్ధిగా ఉండడం, శరీరం పెరుగుదల లేకపోవుడ, నీరసంగా ఉండుట మొదలగు వ్యాధి లక్షణాలు కలిగి ఉంటారన్నారు. రెండు రోజుల ట్రెనింగ్ పూర్తి చేసుకొన్నా బొల్లేపల్లి, భువనగిరి ఆరోగ్య కేంద్రాల మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలకు ట్రెనింగ్ సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో డా. కే.రామకృష్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. యశోద, ప్రోగ్రాం అధికారిణి, మాతా,శిశు, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అంజయ్య, ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ కో ఆర్డినేటర్ ప్రవీణ్, డాక్టర్ అనూష, ట్రెనర్ కుంభంరాజీవ్, కృష్ణ పాల్గొన్నారు.

వాత్సల్య ఫార్మసీ కళాశాలలో స్వాగతఉత్సవాలు

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్



భువనగిరి మండలంలోని అనంతారం శివారులో గల వాత్సల్యఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మెన్ దరిపల్లి నవీన్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ వారిలో ఉండే భయాన్ని తొలగించి వారికి మార్గదర్శకులుగా ఉండాలని కోరారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక టాలెంటు ఉంటుందని, దానిని ఉపయోగించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని, ప్రతి విద్యార్థిలోను ఏదో ఒక ప్రతిభ దాగుంటుందన్నారు.వారి యొక్క సృజనాత్మకత ను వెలికితీయడానికి వాత్సల్య కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేశారు. తదనంతరం కళాశాల ట్రెజరర్ దరిపల్లి ప్రవీణ్‌కుమార్ హాజరై విద్యార్థులనుఉద్దేశించి మాట్లాడారు.వాత్సల్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్నారని, ఈ సంవత్సరం విద్యార్థులను కూడా విదేశాలు పంపించే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. స్వాగత వేడుకల సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.మిస్ రోజెస్ మిస్సెస్ రోజెస్ ఈ స్వాగత వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు తమ ఆటపాటలతో పలువుర్ని అలరించారు.గాయకుడు మధుకర్ పాట ఎంతో మధురంగా పాడి అందరికీ ఉత్తేజాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వాత్సల్య ఫార్మసీ ప్రొఫెసర్ శ్రీధర్ బాబు, ఫార్మాసూటికల్ అనాలసిస్ డిపార్ట్మెంట్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అవిరెండ్ల సునీల్, ఫార్మాసోటిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ బల్లభవాని, వాత్సల్య బి.ఫార్మసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంయుక్త, మనీషా,నరేందర్‌రెడ్డి, నర్మద, జి.వెంకటేష్, ప్రిన్సిపాల్ వెంకటసురేష్,వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ.రెడ్డి, వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల అకాడమిక్ ఇన్‌చార్జి గొల్లపెల్లి సురేష్, ప్రగతి, నిఖిల, పరమేశ్వరి, గోపాలకృష్ణ, రేఖ, నాగమల్లేష్, సుబ్బురు ఆంజనేయ మిత్ర పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

రోడ్డు ప్రమాదంలో అందిమల్ల సతీష్ తీవ్ర గాయాలై ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారని శుక్రవారం పోలీసులు తెలిపారు. మృతుడు అందిమల్ల సతీష్(19) సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం నుండి తల్లిదండ్రులతో కలిసి బతుకు దెరువు కోసం 15 ఏండ్లకింద చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటకు వచ్చి కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారు.గతేడాది నుండి మృతుడు కూడా తల్లిదండ్రులతో పాటు కూలి పనులకు పోతున్నాడు.ఈనెల 17వ తేదీన పనులకు వెళ్లి 18వ తేదీ తెల్లవారుజామున కొత్తగూడెం నుంచి చౌటుప్పల్ మండలంలోని తూప్రాంపేట గ్రామ శివారున నడుచుకుంటూ వస్తుండగా రోడ్డు దాటే క్రమంలో గుర్తు లేని వాహనం ఢీకొనడం వల్ల నడుముకు,కుడి కాలుకు బలమైన రక్త గాయంలు,ముఖం, శరీర భాగాల్లో రాకుడు గాయాలయ్యాయి.క్షతగాత్రుని 108 వాహనం ద్వారా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా ,చికిత్స పొందుతూ ఈనెల 20వతేదీన మృతి చెందాడు.

తప్పిపోయి వచ్చిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగింత

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



హైదరాబాద్ అంబర్‌పేట నుండి తప్పిపోయి యాదగిరిగుట్టకు వచ్చినా నలుగురు పిల్లల్ని పోలీసులు విచారించి వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని దాతర్‌పల్లి గ్రామంలో నలుగురు బాలురు అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానిక పోలీసులు పోలీస్‌స్టేషన్ తీసుకొచ్చి విచారించారు. ఇంట్లో చెప్పకుండా వచ్చారని వివరాలు తెలపడంతో అజ్మత్ (14), హర్షవర్ధన్ (14), భాస్కర్ (13)లతో పాటు మరో పిల్లాడిని అంబర్పేట్ పటేల్‌నగర్‌లో వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లల మిస్సింగ్‌పై అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.పాఠశాలలో ఉపాధ్యాయులు మందలించడంతో దాతర్‌పల్లిలో ఒక బాలుని దూరపుబంధువు ఉండటంతో గుట్టకు వచ్చినట్టు సీఐ వివరించారు.

ప్రజా నాయకుడు అలుగువెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలి

- ప్రజా ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ బండ శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు

విద్యా రంగ సమస్యలపై ప్రస్తావించే ప్రజా నాయకుడు అలుగువెల్లి నర్సిరెడ్డి ని గెలిపించాలని ప్రజా ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. శుక్రవారం గట్టుప్పల మండల కేంద్రంలో ఓటర్లను కలిసి మాట్లాడారు ప్రజా సమస్యలే తన ఎజెండగా విద్యారంగ సమస్యలపై గల మెత్తే నర్సిరెడ్డి ని గెలిపించాలని, గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన నర్సిరెడ్డి ఎమ్మెల్సీ నిధులు మొత్తం విద్యాభివృద్ధికోసం ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై విద్యార్థి సమస్యలపై స్కూలు సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి మొదటి-1 ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఉద్యమ వేదిక రాష్ట్ర నాయకులు కట్ట నరసింహ మండల కన్వీనర్ కర్నాటి సుధాకర్ ప్రజా ఉద్యమ వేదిక నాయకులు కర్నాటి వెంకటేశం ఖమ్మం రాములు బొబ్బల చంద్రయ్య పెదగాని నరసింహ బండ లింగయ్య కర్నాటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్



మండలంలోని యాద్గార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ముఖ్యమంత్రిగా, మంత్రులుగా, కలెక్టర్‌గా, ఇతర అధికారులుగా, ఎమ్మెల్యేగా, డీఈవోగా, ఎంఈవోగా, ప్రధానోపాధాయులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో లావూరి బాలు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, శేఖర్‌రెడ్డి, సైదయ్య, మహేశ్వర్, విజయ, శ్రీశైలం, సైదయ్య, రాము, వెంకటరత్నం, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ పీజీ రెండవ సెమిస్టర్ వార్షిక ప్రచురణ(అల్మోనాక్) విడుదల

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పీజీ రెండవ సెమిస్టర్ వార్షిక ప్రచురణ (అల్మోనాక్)నుఆచార్య అల్వాల రవి విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చ్ 13, 2025న తరగతులను ప్రారంభించి ఆగస్టు 6, 2025 నుండి పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్,ఖమ్మం,నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్, వరంగల్ -ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి తెలియజేశారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ను కోరగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ వ్యాప్తంగా 200 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, నల్గొండ జిల్లాకు సంబంధించి 37 ఉన్నాయని ,ఇందుకుగాను 50 మంది ప్రిసైడింగ్ అధికారులను ,50 మంది పోలింగ్ అధికారులను నియమించడమే కాకుండా, వారికి శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశామని తెలిపారు.వ్ 22 వేల 439 ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులకు గాను, 3358 వరకు పంపిణీ చేయడం జరిగిందని, ఈనెల 25 లోపు తక్కినవి పంపిణీ చేస్తామని, నల్గొండ జిల్లాకు సంబంధించి 4182 ఓటర్ స్లిప్పులకు గాను ,ఇప్పటివరకు 501 పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు జంబో బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నామని, నియోజకవర్గ పరిధిలో అన్ని జిల్లాలలో సరిపడే విధంగా జంబో బాక్సులు ఉన్నాయని, సిద్దిపేట జిల్లాకు మాత్రం జనగామ నుండి తీసుకుంటున్నారని తెలిపారు. 28 వేల బ్యాలెట్ పేపర్లను ఈ ఎన్నికలలో వినియోగించడం జరుగుతున్నదని, వీటన్నింటినీ ఇదివరకే పరిశీలించడం జరిగిందని, శనివారం అన్ని జిల్లాలకు వీటిని పంపిస్తున్నట్లు తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఇతర నియమ, నిబంధనలను ఎప్పటికప్పుడు పోటీలో ఉన్న అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు ,వారి ఏజెంట్లకు తెలియజేస్తున్నామని వివరించారు. నల్గొండ పట్టణం సమీపంలోని ఆర్జాలబావి గోదాము వద్ద ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రత్యక్షంగా అర్జాలబావి గోదాం సందర్శించి ఆమోదం తెలిపారని చెప్పారు. అలాగే 50 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, వారికి శిక్షణ కార్యక్రమాన్నీ కూడా పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 37 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 5 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు గుర్తించడం జరిగిందని, 13 రూట్లను ఏర్పాటు చేశామని, అలాగే ఇందుకు సంబంధించి 15 స్ట్రైకింగ్ ఫోర్సు , 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 29 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ,41 ఎం సి సి బృందాలను నియమించామని, మొత్తం ఎన్నికలలో518 మంది పోలీసుల సేవలను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అదనపు రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వసతిగృహాల్లో చదువుతున్న పదవ విద్యార్థులకు రానున్న పరీక్షల నేపథ్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రేరణ, అవగాహన తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కె.లత అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పలు ఎస్సీ హాస్టల్ల నుండి 300 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఇందుకు సంబందించి పలు సబ్జెక్టులలో ఉన్న సందేహాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణా కార్యక్రమంలో నివృత్తి చేస్తారు.ఈ కార్యక్రమంలో సహాయ షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి అధికారులు డి. మార్తమ్మ,ఎ. ఇందిర, బి. రుక్మిణి జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ వసతిగృహ సంక్షేమ అధికారులు ట్యూటర్స్,యెస్. రమణారెడ్డి,ఎ.వెంకన్న, జి. గురు చరణ్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలిగా నవ్యభాస్కర్

నవతెలంగాణ-ఆత్మకూర్ఎం

మండలకేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దొంతర బోయిన నవ్యభాస్కర్ కాంగ్రెస్ మహిళావిభాగం మండల అధ్యక్షురాలుగా నియామకం అయ్యారు.సోమవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ చేతుల మీదుగా నియామకపత్రాన్ని నవ్య భాస్కర్ అందుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, పార్టీ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి,మహిళా జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, పార్టీ మండల అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, పిఏసీఎస్ జిల్లాల శేఖర్‌రెడ్డి,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు,మాజీ ప్రజా ప్రతినిధులు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ క్రాప్ట్ సర్వేతో ఏఈఓలకు తప్పని ఇబ్బందులు



- సమస్యలు పట్టించుకోకుండా వేగం పెంచాలంటున్న అధికారులు

నవతెలంగాణ-రాజపేట

వ్యవసాయ శాఖలో ఏఈఓ లకు డిజిటల్ క్రాప్ సర్వే అనేక ఇబ్బందులను కొని తెస్తూ ఉద్యోగం భారంగా మారింది. ఒక్కో ఏఈఓకు 10000 ఎకరాల సర్వే టార్గెట్ ఇవ్వడం సమస్యలు పట్టించుకోకపోవడం పనిలో వేగవంతం చేయాలని అధికారులు చెప్పడం ఏఈఓలకు ఉద్యోగం శాపంగా మారింది. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు సర్వే కోసం సిగ్నల్ లేని ప్రాంతాలలో ట్యాబ్‌లేకుండా సొంత సెల్‌ఫోన్లలో సర్వే చేయడం లాంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.కొన్నిచోట్ల దారులు లేకపోవడం నిర్మానుష్యంగా ప్రాంతం ఉండడంతో సెక్యూరిటీ సమస్యను ఎదుర్కొంటున్నారు. సంబంధిత గ్రామ శాఖ కార్యదర్శిని లేదా ఎవరైనా ఉద్యోగిని తోడుగా ఏర్పాటు చేస్తే కొంత మేరకు సర్వేలో ఇబ్బందులు తగ్గుతాయని భావిస్తున్నారు.ఇలా అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ఏఈవోల సూచనలు సలహాలు తీసుకోకుండా సర్వేలో ఎదురవుతున్న సమస్యలను పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు.

ఏఈఓలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇవే..

ఏఈఓలు ఫీల్డ్ మీదికి వెళ్లిన తర్వాత ఆప్ సరిగా పనిచేయకపోవడం వలన పంటల నమోదును చేయలేకపోతున్నారు. మహిళ ఏఈవోలు ముఖ్యంగా కొన్ని డీసీఎస్‌లో ఇచ్చిన కొన్ని సర్వే నెంబర్లు నిర్మాణస్య ప్రదేశాలుగా ఉండడం వలన సహాయకులు లేకపోవడం వలన వెళ్లడానికి భయపడుతున్నారు.డిపార్ట్మెంట్ ఇచ్చిన ట్యాబులు అన్నీ కూడా పనిచేయడం లేదు అందువలన ఫోన్‌లో డీసీఎస్ గంటలకు కొద్ది ఆన్లైన్ చేయడం వలనచేయడం వలన ఫోన్‌లో చార్జింగ్ లేకపోవడం వలన డీసీఎస్ సర్వే సరిగా చేయలేకపోతున్నారు. సర్వే కోసం వెళ్లిన ప్రదేశంలో ఫోన్ సిగ్నల్స్ సరిగా రాకపోవడం వలన, ప్రస్తుత పరిస్థితులలో రైతుల నుండి రుణమాఫీ రైతు భరోసా సంబంధించిన ఫోన్ కాల్స్ అధికంగా రావడం వలన ఏఈవోలు సరిగ్గా పంట నమోదు సరిగ్గా చేయలేక పోతున్నారు.ఏవోలు డీసీఎస్‌లో చూపించిన సర్వే నెంబర్లోకి వెళ్లిన తర్వాత రైతుల యొక్క వేసిన పంటను డీసీఎస్ అప్‌లో అప్‌లోడ్ చేయాలి. సబ్ సర్వే నెంబర్లు గుర్తించడం కష్టంగా ఉంది. ఇలా అనేక సమస్యలను ఏవోలు ఎదుర్కొంటున్నారు. కలెక్టర్ స్పందించి తగు సూచనలు ఇవ్వాల్సి ఉంది.

దోపిడీ విముక్తికి సోషలిజమే సరైన మార్గం

నవతెలంగాణ-నేరేడుచర్ల



దోపిడికి పీడన విముక్తికి సోషలిజమే సరైన మార్గమని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కందగట్ల అనంత ప్రకాష్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని సీపీఐ(ఎం) కార్యాలయం హరిబండి భవన్లో జరిగిన రెడ్‌బుక్‌డే సందర్భంగా సామూహిక అధ్యయనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషలిజం అనేది పగటి కలలు కనే వారి సృష్టికాదని, ఆధునిక పెట్టుబడిదారీ సమాజ అభివృద్ధి క్రమం యొక్క అనివార్య ఫలితం సోషలిజం మార్క్స్ ఎంగెల్స్ తెలిపారని అన్నారు. కార్మిక వర్గం జరిపే వర్గ పోరాటం పెట్టుబడిదారి వర్గంపై అది సాధించే విజయం మాత్రమే ఒక మానవుడు మరొక మానవుని దోచుకోవడం నుండి విముక్తి చేయగలరని ఆయన అన్నారు. కార్మిక వర్గం తన శక్తిని తన ప్రయోజనాలను గుర్తించి సమైక్యంగా వర్గానికి వ్యతిరేకంగా పట్టుదలతో పోరాటం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నేరేడుచర్ల మండల కార్యదర్శి సిరికొండ శ్రీను సిఐటియు నాయకులు నీలా రామ్మూర్తి ,సట్టు. శ్రీను, కొండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఫ్యామిలీ బ్లూమ్‌స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం

నవతెలంగాణ-నేరేడుచర్ల

విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు తెలియజేయాలని శ్రీ చైతన్య పాఠశాల ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యామిలీ బ్లూమ్ స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నేరేడుచర్ల స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు నమస్కరించి పుష్పాలతో పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ డి సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు మంచి భవిష్యత్తును తీర్చిదిద్ద గలవని జన్మనిచ్చిన తల్లిదండ్రులకు గౌరవించడం అనేది మంచి సాంప్రదాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ బ్లూమ్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం అనేది అత్యున్నతమైన కార్యక్రమం అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య , డీ.జి.యం సుధాకర్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు ఆర్ ఐ సుజిత డీన్ విజయకృష్ణ,విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై ఆంక్షలు తగవు

నవతెలంగాణ-హుజూర్‌నగర్



కేంద్ర ప్రభుత్వం న్యాయ వాదులపై పలు ఆంక్షలు విధిస్తూ న్యాయవాదుల చట్టానికి పలు సవరణలు చేస్తూ రూపొందిచ తలపెట్టిన బిల్లును బేషరతుగా ఉపసంహరించుకోవాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయవాదుల చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కేంద్ర న్యాయవాదుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాద రంగంలోనికి ప్రజాప్రతినిధులను పంపిస్తూ, న్యాయవాదులపై పలు ఆంక్షలు విధిస్తూ రూపొందిస్తున్న బిల్లును దేశవ్యాప్తంగా లక్షలాది మంది న్యాయ వాదులు వ్యతిరేకిస్తున్నారన్నారు. బార్ కౌన్సిల్ కార్యవర్గం లో ఇద్దరు ప్రజాప్రతినిధులు ఉండేలా చట్ట సవరణలు రూపొందించ బోతున్నారని రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేయటం వల్ల బార్ కౌన్సిల్ రాజకీయం కానున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతకుముందు బార్ అసోసియేషన్ తీర్మాన కాపీలను రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యాం శ్రీ, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ లకు అందజేశారు. శనివారం కూడా న్యాయ వాదుల విధుల బహిష్కరణ కొనసాగు నున్నట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జక్కుల నాగేశ్వరరావు, న్యాయ వాదులు కాల్వ శ్రీనివాసరావు, చనగాని యాదగిరి, మీసాల అంజయ్య, దూళిపాల శ్రీనివాసరావు, కమతం నాగార్జున, గొట్టె ప్రశాంత్, రమణారెడ్డి, వట్టికూటి అంజయ్య, వెంకటరెడ్డి, పాలేటి శ్రీనివాసరావు, నాగేందర్ నాయక్, పసుపులేటి వీరు, నాగపాషా, చక్రాల వెంకటేశ్వర్లు, శంకర్ నాయక్, శ్రీను నాయక్, సైదా హుస్సేన్, మద్దుల నాగేశ్వరరావు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చనిపోతున్న నాటు కోళ్లు

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో గత నాలుగు రోజుల్లో చాలా వరకు పెరట్లో పెంచుకునే నాటు కోళ్లు చనిపోవడం జరుగుతుందని, చనిపోయిన కోళ్ల లక్షణాలు గుర్తించి పశు వైద్యాధికారులు వైద్యం అందించాలని గ్రామస్తులు కోరారు. ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన గృహిణులు కోళ్ల పెంపకం చేయడం జరుగుతుందని, అలా చేసే కోళ్లు ఒక్కసారిగా చనిపోవడం వల్ల ఆర్థికంగా కొంత నష్టపోవాల్సి వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి

నవతెలంగాణ-నకిరేకల్

వార్డులో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ దైద స్వప్న రవీందర్ పేర్కొన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలో 18 వార్డు ప్రజలు తమ సమస్యలైయిన మంచినీటి సమస్య, పారిశుద్ధ్య సమస్య, దోమల సమస్య, వీధి దీపాల సమస్యలను వార్డు కౌన్సిలర్ దైద స్వప్న రవీందర్ దృష్టి కి తీసుకెళ్లారు.వారు స్పందించి శుక్రవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో వార్డులో డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయించి దోమలనివారణ కోసం దోమలమందు ఫాగింగ్ చేయించారు. వీధి దీపాలను మరమ్మత్తు చేయించారు.

ప్రపంచ మానవాళికి ఎర్రజెండానే దిక్సూచి

నవతెలంగాణ-సూర్యాపేట



ప్రపంచ మానవాళికి విముక్తి చూపించేది ఎర్ర జెండా మాత్రమేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు అన్నారు. రెడ్‌బుక్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ(ఎం) 24వ మహాసభ రాజకీయ తీర్మానం, ముసాయిదా, సమీక్ష నివేదికపై నిర్వహించిన సామూహిక అధ్యయనం- చర్చావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో దోపిడి, పీడన ,వివక్షత, అణచివేత, ఆర్థిక సమానతలు ఉన్నంతకాలం కమ్యూనిజం అజేయంగా నిలుస్తుందన్నారు.భవిష్యత్తులో ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు జరగకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టి పల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ చర్చ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న, జిల్లపల్లి నరసింహారావు, మేకనబోయిన శేఖర్ ,ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన రవి, పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్, పార్టీ 2 టౌన్ కార్యదర్శి పిండిగానాగమణి, పార్టీ రూరల్ మండల కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు చిన్నపంగ నంసయ్య మేకనబోయినసైదమ్మ, కామల్ల లింగయ్య, పొదిలఅంజయ్య, జలగం సత్తయ్య పాల్గొన్నారు.

నాంపల్లి మండలంలో

ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

నవతెలంగాణ - నాంపల్లి

ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన ప్రభుత్వ పథకాల కోసం లబ్దిదారుల ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వ ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క పెన్షన్, ఒక ఇందిరమ్మ, రేషన్ కార్డులు మంజూరు చేయకపోగా పలు సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ ఉండడంతో గ్రామాలలో ప్రజలు నానాటికి ప్రభుత్వం పై విశ్వాసాన్ని కోల్పోతున్నట్లుగా కనిపిస్తున్నది. గత జనవరి 21వ తేదీ నుండి జరిగిన ప్రజా పాలనలో నాంపల్లి మండల వ్యాప్తంగా 32 గ్రామపంచాయతీల ప్రజల నుండి ఇందిరమ్మ గృహాల 2,417, నూతన రేషన్ కార్డుల కోసం 1877 అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. అధికారులు త్వరగా నిజమైన లబ్దిదారులను ఎంపిక చేసి లబ్ది చేకూరేలా చేయాలని కోరుతున్నారు.



నాలుగు సంవత్సరాలుగా పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న:

-ఎదుళ్ళ సుజాత నాంపల్లి

నేను ఎస్సీ నిరుపేద కూలి కుటుంబానికి చెందిన మహిళను. నా భర్త చనిపోయి నాలుగేండ్లు గడిచిపోయాయి. గత ప్రభుత్వంలో రెండు పర్యాయాలు వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసిన ఫలితం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోవడం జరిగింది. అయినప్పటికీ నేటి వరకు పెన్షన్ మంజూరు కాలేదు.



ఇందిరమ్మ ఇల్లుకు అర్హత ఉన్నా అనర్హుల జాబితాలో చేర్చారు

- కర్నాటి విజయలక్ష్మి

మేము 20 సంవత్సరాలకు పైగా నాంపల్లి పట్టణ కేంద్రంలో అద్దె గృహంలో ఉంటూ ఇద్దరు పిల్లలతో కలిసి బట్టలు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు సొంత ఇల్లు కానీ, సొంత స్థలం కానీ లేవు. మాకు ప్రభుత్వం ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని ఎంతో నమ్మకంతో ఉన్నాం. కానీ సర్వే చేసిన అధికారి నిర్లక్ష్యంతో ఆన్లైన్ లో మాకు సొంతంగా సిమెంటు స్లాబ్ కలిగిన ఇల్లు ఉన్నదని తప్పుడు వివరాలు నమోదు చేయడంతో సొంత ఇల్లు కలిగిన వారి జాబితా మూడు లోకి మా పేరు వెళ్లిపోయింది.



రేషన్ కార్డు కోసం మూడు సార్లు దరఖాస్తు చేసుకున్న రాలేదు

-నేరళ్ల సైదులు

నేను రేషన్ కార్డు కోసం రెండు పర్యాయాలు ప్రజా పాలనలో, ఒకసారి మీ సేవలో మొత్తం మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నా. కానీ ఇప్పటివరకు రేషన్ కార్డు మంజూరు కాలేదు. నాకు వివాహమై ఐదేండ్లయ్యింది.. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్సీ కులానికి చెందిన నిరుపేదను, రేషన్ కార్డు అనేది నిత్యవసర సరుకులతో పాటు ప్రతి ప్రభుత్వ పథకానికి ముడిపడి ఉండడంతో ఆరోగ్యశ్రీ ఇలాంటి పథకానికి రేషన్ కార్డు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

పథకాల కోసం.. ఎదురుచూపులు



ప్రభుత్వాలు మారినా ,పాలకులు మారినా ప్రభుత్వ పథకాల కోసం లబ్దిదారుల ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా నేటికీ పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం పలు సర్వేల పేరుతో కాలయాపన చేస్తుండడంతో నానాటికి ప్రభుత్వం పై ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతున్నట్టుగా కనిపిస్తున్నది.

మర్రిగూడ మండలంలో

నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలో 18 గ్రామపంచాయతీలు ఉన్నాయి.మండల వ్యాప్తంగా ఇప్పటివరకు రేషన్ కార్డుకు 3280,ఇందిరమ్మ ఇండ్లకు 1503 అప్లికేషన్లు వచ్చాయి.అదేవిధంగా గతంలో మండల వ్యాప్తంగా నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల కొరకు 5 వేలకు పైగా ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అప్లికేషన్ అనేది నిరంతర ప్రక్రియ అని చెప్పటంతో మీసేవ కేంద్రాలలో రేషన్ కార్డుల ఆన్లైన్ అప్లికేషన్లు నేటికీ కొనసాగుతున్నాయి.ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు మీ సేవ కేంద్రాల వద్ద జనం కిటకిటలాడుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవడమే తప్ప పూర్తిస్థాయిలో అమలు కావటం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రేషన్ కార్డు జారీలో జాప్యం జరుగుతుంది

వస్పరి శంకర్ (దామెర భీమనపల్లి,మర్రిగూడ)



నాకు వివాహమై 8సంవత్సరాలు అవుతుంది.మా కుటుంబానికి రేషన్ కార్డు లేదు.పలుమార్లు అప్లై చేసుకున్న ప్రయోజనం లేదు.ఇటీవల మీ సేవ కేంద్రంలో మరల అప్లై చేసుకున్నాను.రేషన్ కార్డు జారీలో జాప్యం జరుగుతుంది.రేషన్ కార్డు పై ఒక స్పష్టత లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ప్రభుత్వం ప్రతిదానికి రేషన్ కార్డు తప్పనిసరి చేయటంతో సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నాము.

నకిరేకల్ మండలంలో

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-నకిరేకల్

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. నకిరేకల్ మండలంలోని 17 గ్రామపంచాయతీలలో 3328 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా 2897 మంది కొత్త రేషన్ కార్డుల కోసం, నకిరేకల్ మున్సిపాలిటీ తో కలుపుకొని 1832 మంది రేషన్ కార్డులో అదనపు సభ్యులను చేర్చాలని దరఖాస్తు చేసుకున్నారు.



పదేళ్లుగా ఎదురుచూస్తున్న : పోగుల సతీష్, నకిరేకల్



కొత్త రేషన్ కార్డు కోసం పదేళ్ల నుండి ఎదురుచూస్తున్న. పలుమార్లు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన. అదిగో, ఇదిగో అంటున్నారే తప్ప ఇంతవరకు రేషన్ కార్డు రాలేదు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి : చెట్టుపల్లి ప్రకాష్, గోరింకలపల్లి

నాకు వ్యవసాయ భూమి సెంటు కూడా లేదు. కూలీనాలి చేస్తేనే బతుకుతెరువు గడుస్తుంది. ఇల్లు కట్టుకునేందుకు సొంత జాగా ఉంది. అధికారులు పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నా.

మునుగోడు మండలంలో



పక్షవాతం వచ్చి ఐదేళ్ల నుంచి అవస్థ పడుతున్న.. పింఛన్ రావడం లేదు

- వరంగాంటి బచ్చయ్య పులిపల్పుల

నవతెలంగాణ-మునుగోడు

పక్షవాతం వచ్చి ఐదు సంవత్సరాల నుండి పింఛన్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పింఛన్ రావడం లేదు . సదర్ సర్టిఫికెట్ రెండుసార్లు రెన్యూవల్ చేసుకున్నాను. కానీ పింఛన్ మాత్రం రావడం లేదు. ప్రభుత్వం నుండి కొత్త పింఛన్లు వస్తున్నాయి తెలిసినప్పుడల్లా ఎదురుచూస్తున్నాను .కానీ పింఛను మాత్రం నాకు రావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పింఛన్‌ను వచ్చే విధంగా చేయాలి

రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు ఏవి మాకు రావడం లేదు...

-రేవెల్లి గణేష్ మునుగోడు



పెండ్లి అయ్యి ఐదు సంవత్సరాలు అయితుంది , నాకు ఇద్దరు కూతుర్లు పుట్టినప్పటికీ రేషన్ కార్డు లేదు. కొత్త రేషన్ కార్డులకు అప్లై చేసుకో అన్నప్పుడల్లా చేసుకున్నాను. కానీ ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డు రాకడప్పంతో మా కుటుంబానికి రావలసిన ఉచిత రేషన్ బియ్యం , ఉచిత గ్యాస్ , ఉచిత విద్యుత్ పథకం రావడం లేదు . ఇప్పటికైనా అధికారులు మాకు కొత్త రేషన్ కార్డును మంజూరు చేయాలి.

పూరి గుడిసె లోనే ఉంటున్నాం - బీసం కలమ్మ మునుగోడు..



నాకు ఇద్దరు బిడ్డలు, ఒక కొడుకు మేము వ్యవసాయం చేసుకుంటూ మా సొంత స్థలంలో పూరి గుడిసెలోనే ఉంటున్నాం. మా ఇద్దరు బిడ్డల పెండ్లిలు చేశాను. పెండ్లిలకు చేసిన అప్పులు తీర్చుకొని ఇల్లు కట్టుకునేందుకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం నుండి మాకు ఇల్లు మంజూరు అయితే ఇల్లు కట్టుకుందామని గత కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాం. కానీ , ఇంతవరకు మాకు ప్రభుత్వం నుండి సర్వేలు చేసుకోబోతున్నారు. తప్ప ఇల్లు మాత్రం మంజూరు కావడం లేదు. పూరి గుడిసెలో ఉండాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వ నుండి మాకు ఇల్లు మంజూరు చేయాలి .

హుజూర్‌నగర్‌లో

ఎన్నికల కోడ్ పేరుతో పథకాలు నిలిపివేశారు

పట్టణవాసి తూముల వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-హుజూర్‌నగర్

ప్రభుత్వ పథకాల కోసం ప్రజాపాలనలో, మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించిన అర్హులందరికీ వెంటనే తెల్ల రేషన్ కార్డులు జారీ చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించినప్పటికీ ఎన్నికల కోడ్ పేరుతో పథకాలను అమలు చేయడం లేదు. వికలాంగుల, వృద్ధులకు పెన్షన్లు రూ.4వేలు చేస్తామని ప్రకటించి14 నెలలు గడిచినప్పటికీ అమలుకు నోచుకోలేదు. స్థలం ఉన్నవారికి ఐదు లక్షలు ఇస్తామని, స్థలము ఇల్లు లేని వారికి ఇందిరమ్మ గృహాలు పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికీ నోచుకోవటం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జాప్యం లేకుండా లబ్దిదారులకు పథకాలు అందజేయాలి.



రైల్వే గేట్ అండర్ పాస్ నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలోని రైల్వేగేట్ అండర్‌పాస్ నిర్మాణపనులు వేగవంతం చేస్తామని, మరో మూడు నెలల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. అలేరు పట్టణంలో శుక్రవారం రైల్వేగేట్ వద్ద రెండవ దశ, మెయిన్ రోడ్డు ఆనుకొని ప్రారంభమైన పనులను, అండర్‌పాస్ నిర్మాణపనులను పరిశీలించారు. రైల్వేగేట్ మెయిన్‌రోడ్డు అవతలి వైపు, రఘునాథపురం రోడ్డు, సిద్దిపేటరోడ్లను ఆనుకొని ఉన్న పూర్తి కావస్తున్న పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పట్టణంలోని రైల్వే గేట్ పాత ఊరు, కొత్త ఊరు ఇరువైపుల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, రైల్వేగేట్ అండర్‌పాస్ నిర్మాణపనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ కారణంగా నిర్మాణపనుల్లో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు, పనులు వేగవంతంగా జరిగేందుకు, పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విప్పు బీర్ల ఐలయ్య కాన్వాయ్ మెయిన్ రోడ్‌పై ఆగడంతో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.ఎస్సై రజనీకర్, పోలీస్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని ప్రయాణికులకు, వాహనదారులకు, వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ, మిషన్‌భగీరథ గ్రిడ్,జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కట్టా లింగయ్యకు నివాళులు


నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన కట్ట లింగయ్య గురువారం రాత్రి నకిరేకల్ తిప్పర్తి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి పోస్టుమార్టం గదిలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట శుక్రవారం కాశీం పాషా అనారోగ్యంతో మృతి చెందారు.ఆయన పార్థివదేహానికి మాజీ సర్పంచ్ బుడిగే గౌతమి నరసింహారావు నివాళులర్పించారు.వారి కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమ సొంత నిధులతో రూ.10వేల ఆర్థికసాయం అంద జేశారు. ఈ కార్యక్రమంలో వంటేరు ఇంద్రసేనారెడ్డి, సోప్పరి మధు, ఇమామ్‌పాషా, సాగర్ల కనకయ్య పల్లెపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో... అలసత్వం వహిస్తే చర్యలు

- హాస్టల్లోనూ ,ఆరోగ్య కేంద్రంలోనూ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్
- బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ , కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారికి షోకాజ్ నోటీసులు జారీ

నవతెలంగాణ-మునుగోడు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు . శుక్రవారం మండల కేంద్రంలోని బిసి బాలుర హాస్టల్ , కస్తూర్బా పాఠశాల , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , తాసిల్దార్ కార్యాలయమును ఆకస్మికతనికి చేశారు .బిసి బాలుర హాస్టల్ వార్డెన్ , కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి సమయపాలన పాటించకపోవడంతో పాటు సమాచారం ఇవ్వకుండా వెళ్లడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు . కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యా విధానంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. బోధించే సమయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు .



ఉన్నతమైన స్థాయికి ఎదిగేందుకు పట్టుదలతో విద్య కిరా రంగలలో రాణించాలని విద్యార్థులకు సూచించారు . ఈ కార్యక్రమంలో చండూర్ ఆర్డీవో శ్రీదేవి , తాసిల్దార్ నరేందర్ , ఎంపీడీవో శాంతి కుమారి , ఆర్ ఐ నాగరాజ్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటి విడుదలపై సమీక్ష నిర్వహించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి

నవతెలంగాణ-తుంగతుర్తి



తుంగతుర్తి, మద్దిరాల నూతనకల్ మండలాలకు ఎస్సారెస్పీ నీటి విడుదల కోసం అధికారులు సమీక్ష నిర్వహించి చివరి భూములకు నీళ్లు అందించి, రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ మేరకు రబీ సీజన్లో రైతులు వేసిన పంటలకు భూగర్భ జలాలు అడుగంటిపోయి నీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నదృష్ట్యా, ప్రభుత్వ అధికారులు ఎస్ఆర్ఎస్పి కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు కుంటలు నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో రైతాంగం నీటిని విడుదల చేయాలని ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు.ఎస్సారెస్పీ కాలువ మీద ఆధారపడి పంటలు వేసినటువంటి రైతాంగం పొలాలు ఎండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోతున్న రైతుల పంట పొలాలను కాపాడడానికి నీటిని విడుదల చేయకపోతే రైతాంగాన్ని ప్రజలను సమీకరించి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి, మద్దిరాల మండల కార్యదర్శి పోలోజు సైదులు, తిరుమలగిరి మండల కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య, నాయకులు ముత్తయ్య, జోగునూరి దేవరాజు, కూసు సైదులు, దీకొండ ఉపేందర్, వజ్జె సైదులు, వనం సోమయ్య, బానోతు టీక్యా, విమల, మధు పాల్గొన్నారు.

వంగాల గ్రామవాసికి డాక్టరేట్

నవతెలంగాణ-గుండాల



మండలంలోని వంగాల గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన పాల శ్రీనివాస్ ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రకటించిన పీహెచ్‌డీ ఫలితాల్లో ఇంగ్లీష్ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందినట్లు పాలశ్రీనివాస్ తెలిపారు.ప్రాథమికవిద్యను తుర్కలషాపురం గ్రామంలో ఉన్నత పాఠశాల మోత్కూరు,ఇంటర్ విద్యను గురుకుల కళాశాల రాజాపేటలో డిగ్రీ ఆపై హైదరాబాద్‌లో పూర్తి చేసిన ఆయన ఎంఏ ఇంగ్లీష్‌ఎం ట్రన్స్ పూర్తిచేసి పీహెచ్‌డీలో తృతీయస్థాయిలో అభ్యాసకులకు ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను బలోపేతం చేయడానికి డిజిటల్ వనరుల వినియోగంపై చేసిన పరిశోధనలో డాక్టరేట్ పట్టాను సాధించారు.మారుమూలప్రాంతంలో జన్మించి డాక్టరేట్ పొందిన పాల శ్రీనివాస్‌ను గ్రామస్తులు,కుటుంబసభ్యులు అభినందించారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-క్లాక్‌టవర్



యూ ఎఫ్ బి యూ పిలుపు మేరకు బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వేతన సవరణ ఒప్పందంలో ఉద్యోగులకు ఇప్పటివరకు చేయలేదని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకులో సిబ్బంది కొరత ఉందని, అన్ని కేడర్ల నియామకాలు చేయాలని అన్నారు. బ్యాంకులో టెంపర్ వారి గా పనిచేస్తున్న ఉద్యోగులను పర్మిట్ చేయాలని, ఔట్సోర్సింగ్ విధానం రద్దు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లు వేతనం ఇవ్వాలని తక్షణమే తమ డిమాండ్లను కోరారు. 24 25 ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో %ఖీదీఖ% జిల్లా కన్వీనర్ కత్తుల ఈశ్వర్ కుమార్, సెక్రటరీ శ్రామిక్, సుమన్, శ్రవణ్, , ప్రవీణ్, వెంకట్ రామ్,యాదయ్య,స్వాతి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా సుగుణ

నవతెలంగాణ-నేరేడుచర్ల

కాంగ్రెస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలుగా బచ్చలకూరి సుగుణ నియమితులయ్యారు. గురువారం హుజూర్నగర్ లోని పార్టీ కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి చేతుల మీదుగా తన నియామక ఉత్తర్వులను అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన తోటి మహిళలను చైతన్యపరచి పార్టీ సూచనలతో ముందుకెళ్తామన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షులు అనురాధ మరియు పార్టీ మండల అధ్యక్షులు కొనతం చిన్న వెంకటరెడ్డి పట్టణ అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మునిసిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ అలక సరిత సైదిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆపదమిత్ర వాలంటీర్ల శిక్షణ ముగింపు

నవతెలంగాణ-నల్లగొండప్రాంతీయ ప్రతినిధి

జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్ డి ఆర్ ఎఫ్) , రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్ ఎఫ్) ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో మొదటి విడతగా ఈనెల10- నుండి 21-వరకు 12 రోజుల్లో 100 మందికి ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం జిల్లా గ్రామీణ సంస్థ నల్లగొండ కార్యాలయంలో నిర్వహించారు. శుక్రవారం శిక్షణ ముగింపు సమావేశం నిర్వహించారు.12 రోజులు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, జిల్లా ఫైర్, అటవీ, వైద్య రెవిన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మత్స్య శాఖ, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు శిక్షణ ఇచ్చారు . ఇట్టి శిక్షణలో మంటలు, వరదలు, భూకంపాలు మొదలు విపత్తులు నిర్వహణ, ప్రతిస్పందన తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి రక్షించడం, ప్రథమశికిత్స చేయడం వివిధ శాఖలతో సమన్వయం చేసుకోవడం మొదలు అంశాలపై అవగాహన కల్పించారు.శిక్షణ లో భాగంగా రెండు రోజులు రెండు గ్రూపులలో (నాలుగు గ్రామాలు) కనగల్, పర్వతగిరి, మునుగోడు, పులిపలుపుల గ్రామాల సందర్శన చేయించడం , పానగలు ఉదయ సముద్రంలో ఫైర్ ముత్యశాఖ ఆధ్వర్యంలో చెరువుల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, ప్రాక్టికల్ గా శిక్షణ ఇచ్చారు. శిక్షణతో పాటు ఆపదమిత్ర వాలంటీర్లు అందరికీ ప్రతిరోజు



హార్ట్ఫుల్ నెస్ మెడిటేషన్ పై, శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఇట్టి శిక్షణ కార్యక్రమం జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, వై శేఖర్ రెడ్డి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి/ ఆపద మిత్ర నోడల్ అధికారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణ మేనేజర్ డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డిఐటి పి.వెంకటేశ్వర్లు శిక్షణ సమన్వయకర్తగా నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన ఆపదమిత్ర వాలంటీర్లు అందరికీ ఐడి కార్డులు, సర్టిఫికెట్లు డిఆర్డిఓ చేతుల మీదుగా బహుకరించినారు. ముగింపు కార్యక్రమంలో డిఆర్డిఏ డిపిఎం మోహన్ రెడ్డి, ఏపిఏ ప్రభాకర్, డి.పి. ట్రైనర్ విష్ణువర్ధన్, జయ,వెంకన్న, జెఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

అండర్ -14 ఉడ్-బాల్ క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-మర్రిగూడ

మండల కేంద్రంలోని సెయింట్ మేరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-14 ఉడ్- బాల్ క్రీడా పోటీలను పాఠశాల కరస్పాండెంట్ పులి రాజు, ప్రిన్సిపల్ జంగిలి ఝాన్సీ ప్రారంభించారు. ఈ పోటీలో కొంతమంది క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్ర ఉడ్-బాల్ జట్టుకు ఎంపిక అయ్యారని ఉమ్మడి నల్గొండ జిల్లా ఉడ్-బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి రహమత్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర జట్టులో ఆడతారని. మార్చి 21 నుండి 27 వరకు నాగపూర్‌లో జరిగే జాతీయస్థాయి ఛాంపియన్షిప్ టోర్నమెంటులో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోచ్.మేడిపల్లి పవన్, బి. నవీన్, పి.గణేష్, ఈ.తరుణ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామినేని హాస్పిటల్లో ఉచిత శస్త్ర చికిత్స శిబిరం

నవతెలంగాణ-నార్కట్పల్లి

మండల కేంద్రంలోని కామినేని హాస్పిటల్ లో ఈనెల 18వ తారీకున ప్రారంభమైన ఉచిత శస్త్ర చికిత్సల్లో భాగంగా లిపోమా , గ్యాంగ్లియన్సిస్ట్, డెర్మోఇడ్సిస్ట్ రొమ్ము గడ్డలు హెర్నియా థైరాయిడ్ వెరికోస్ వేయిన్స్ తదితర రుగ్మతలకు ఈనెల 25 వరకు జరిగే ఉచిత శస్త్ర చికిత్స సేవలను సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 8639330806, 910890 3305, 994942 1883 నెంబర్లకు సంప్రదించాలని కామినేని వైద్య విజ్ఞాన సంస్థ నార్కెట్పల్లి వారు తెలిపారు.

ఘనంగా సామూహిక శ్రీఅనగాష్టమి వ్రతములు

నవతెలంగాణ-మిర్యాలగూడ

రైల్వే కాలనీ శ్రీసాయి దత్త ఆశ్రమంలో శుక్రవారం అనగాష్టమి వ్రతంలో నిర్వహించారు. తెల్లవారుజామున దత్తాత్రేయ అభిషేకంలో అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అనగాష్ట వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు ప్రతాప్ ప్రధాన కార్యదర్శి నరేందర్. కోశాధికారి మట్టయ్య జానకి రాముడు, విక్రం, వాసు, అంజిబాబు, పద్మ భాగ్యలక్ష్మి, కళ్యాణి సుకన్య ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన వేముల వీరేశం

నవతెలంగాణ-నార్కట్పల్లి

మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ గార్డెన్స్ లో శుక్రవారం జరిగిన రంగ లక్ష్మీనారాయణ శైలజల కూతురు వివాహ మహోత్సవానికి నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పాల్గొని నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

బొడ్డు బాబురావుకు డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల పట్టణానికి చెందిన బొడ్డు బాబురావు కు మనం ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్ లో గురువారం రాత్రి డాక్టరేట్ అవార్డు పొందడం పట్ల మాజీ సర్పంచ్ జిట్ట నగేష్ హర్షం వ్యక్తం చేశారు. సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులుగా బొడ్డు బాబురావు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు మనం ఫౌండేషన్ గుర్తించి ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనం లో గురువారం రాత్రి మాజీ బి.సి కార్పొరేషన్ చైర్మన్ ఒకలా భరణం క్రిష్ణ మోహన్ , డాక్టర్ ఆది నారాయణ, రిటైర్డ్ జడ్జి నేరళ్ళ మాల్యాద్రి చేతుల మీదుగా బాబురావు అవార్డు పొందటం శుభపరిణామం అని కొనియాడారు. అవార్డు కు సహకరించిన మనం ఫౌండేషన్ చైర్మన్ డా.కె చక్రవర్తి,ఇతర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహ మహోత్సవంలో పాల్గొన్న చిరుమర్తి లింగయ్య

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

పట్టణ కేంద్రంలోని ఎస్ఎల్ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన జనగ నరసింహా యాదవ్ ధనమ్మల కూతురు వివాహ మహోత్సవానికి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

కింగ్ సౌత్ రెస్టారెంట్ ప్రారంభం

నవతెలంగాణ-ఛాక్‌టవర్

వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డాక్టర్ జాకీర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైతు బజారు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కింగ్ సౌత్ రెస్టారెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. రైతు బజార్ ప్రాంతంలో రెస్టారెంట్,ది హౌస్ను ప్రారంభించడం చాలా హర్షణీయం అన్నారు.ఈ ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ జాకీర్ హుస్సేన్‌ను హోటల్ యజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో హోటల్ యజమాని ఎండి షఫీక్, రఫీ యుద్దీన్, అబ్దుల్ వాహెద్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

నవతెలంగాణ-నకిరేకల్

ముత్యాలమ్మ గుడి అభివృద్ధికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. పట్టణంలోని ఏడో వార్డులో గల బాబాసాహెబ్‌గూడెం గ్రామంలో శుక్రవారం ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యాలమ్మ గుడి చుట్టూ ప్రహరీ నిర్మించి, గుడి ప్రాంగణంలో సీసీ ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చేగోని రజిత శ్రీనివాస్, ప్రముఖ పారిశ్రామికవేత్త కందాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ ఒంటెపాక సరోజ శ్రీను, ఏసోబు అంబేద్కర్, బాలరాజు, వెంకన్న, మోహన్, జీవన్ కుమార్, మధుసూదన్, దేవాలయ నిర్వాహకులు సలోజు శ్రీనివాస్, భూపతి వెంకటనారాయణ, చెవుగొని వీరస్వామి, భూపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-భువనగిరి

శ్రీ పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ కొల్హారి రాజు ఆధ్వర్యంలో ఆలయకమిటీ ఆహ్వాన పత్రికలు అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు నరాల జంగయ్యయాదవ్, సోమ రవీందర్‌రెడ్డి, కాల్వ స్వాతి, నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎండి మాజీ మున్సిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, అవేస్ చిస్తీ, పీఏసీఎస్ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్, నర్సింహ, యాదగిరి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కల్తీ ఆహారం అమ్మితే చర్యలు

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

హోటల్లు, రెస్టారెంట్లు, మాల్స్, చిన్న చిన్న బడ్డీ కొట్లు తదితర ప్రదేశాలలో కల్తీ ఆహార పదార్థాల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ దాడులు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చికెన్ విషయంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా పనిచేయాలని అన్నారు. ఎక్కడైనా రెస్టారెంట్లు, హోటల్లు బడ్డీ కొట్లు, తోపుడు బండ్లు వారు వాడిన నూనెలను తిరిగి వాడడం ,అలాగే కాలపరిమితి ముగిసిన ఆహార పదార్థాలను వాడటం వంటివి చేయకుండా తరచూ దాడులు నిర్వహించాలని, ఎవరైనా అలాంటి వాటికి పాల్పడితే సీజ్ చేయడమే కాకుండా, కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఈ విషయంపై ఫుడ్ సేఫ్టీ జోనల్ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ ఇప్పటివరకు అభద్రత ఆహార పదార్థాలను వినియోగించినందుకుగాను నల్గొండ జిల్లాలో 16 కేసులు నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి శ్రావణ్, డిఈఓ బిక్షపతి, ఎస్పీ డీఎస్పీ రమేష్, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పట్ల అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి

నవతెలంగాణ-మర్రిగూడ

నర్సరీలో మొక్కల పెంపకం పట్ల సంబంధిత అధికారులు సిబ్బంది అప్రమత్తగా ఉండాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వై.శేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు.శుక్రవారం మండలంలోని లెంకలపల్లి గ్రామంలో ఉన్న నర్సరీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు.వేసవి కాలంలో నీటి ఎద్దడి కారణంగా మొక్కలు చావకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.నర్సరీ మెయింటెనెన్స్ పై అధికారులకు,సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు.ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టే పనులు,గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల గురించి అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన లెంకలపల్లి నర్సరీ మెయింటెనెన్స్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య,ఎంపీ ఓ రవికుమార్,ఇన్చార్జ్ ఏపీవో వివేక్,టెక్నికల్ అసిస్టెంట్ లు సత్యనారాయణ, శంకర్, నరసింహ, పలు గ్రామాల గ్రామపంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



రోడ్డు ప్రమా దంలో ఒకరు మృతి చెందిన సంఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వలిగొండ రోడ్డు పై చోటుచేసు కుంది.సర్కిల్ ఇన్స్పెక్టర్ జి మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు కోయాడ నందిని(40) హైదరాబాద్ కొయ్యలగూడెం. వలిగొండ మండలం గొల్లెపల్లి గ్రామంలోని తన ఆడబిడ్డ ఇంటి నుండి భర్తతో కలిసి బైక్‌పై తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డు వద్దకు హైదరాబాద్‌కు వైపునకు వెళ్తుండగా కంటెయినర్ లారీ(ఎంహెచ్44 యూ2096) వెనక నుండి ఢీకొట్టింది.ఈఘటనలో నందినికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని సోలిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేమూరి కృష్ణగౌడ్ కూతురు వినీషా రవీందర్‌గౌడు ల వివాహానికి శుక్రవారం ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సింగిరెడ్డి మల్లేశం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ రాజేశ్, మాజీ జెడ్పీటీసీ బీర్ల రాజేశ్వర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ రామస్వామి, మాజీ సర్పంచ్ రెడ్డినాయక్, ఉపేందర్‌యాదవ్, మొలుగుబాబు, కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాల్‌రెడ్డికి నివాళులు

నవతెలంగాణ-రాజపేట

రాజాపేట మండలం సింగారం గ్రామంలో ఏరువ బాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు.కాగా శుక్రవారం ఆయన దశదిన కర్మ లో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి పాల్గొని నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, బీఆర్ఎస్ యువజన విభాగ మండల అధ్యక్షుడు పల్లె సంతోష్ కుమార్, కనకయ్య, మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, కోఆపరేటివ్ డైరెక్టర్ గొల్లపల్లి భాగ్యలక్ష్మి భానురెడ్డి, గొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొండేరు చెరువు గ్రామ శాఖ అధ్యక్షుడు తోకల నరసింహులు కూతురు వివాహానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సట్టు తిరుమలేష్, సంధిల భాస్కర్, బొంగోని ఉప్పలయ్య, ఎర్ర గోకుల జస్వంత్, దుర్వేందర్ సింగ్, రాము నాయక్, రాజు, కనకయ్య, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబర, నిస్వార్థపరునికి నిలువెత్తు అవమానం

నవతెలంగాణ-రాజపేట


ఎమ్మెల్యే అనే పదానికి పూర్తి నిర్వచనం, నిరాడంబర నిస్వార్థపరుడు, ప్రజల కోసమే తన ఐదు పర్యాయాల ఎమ్మెల్యే పదవితో ప్రజా సేవ చేసిన గుమ్మడి నరసయ్యకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అవమానం ప్రజలకు, ప్రజాస్వామ్యానికి జరిగిన అవమానమేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మండల ఉపాధ్యక్షులు ఎర్రగోకుల జస్వంత్‌లు ఆరోపించారు. శుక్రవారం రాజపేటలో వారు మాట్లాడారు. ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలు విన్నవించేందుకు గుమ్మడి నరసయ్యకు అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం ప్రజాపాలన ధర్మమా అని ప్రజలకు ఇచ్చే గౌరవం ఇదేనా పూర్తిగా ప్రశ్నించారు. ఇక మామూలు ప్రజలకు ఏం గౌరవిస్తారని, ఇది ప్రజా పాలన కాదని, ఈ రాష్ట్రంలో దుర్మార్గ పాలన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రజా ప్రతినిధులఫోరం అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్యగౌడ్, రాష్ట్ర తాజా మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, మండల రైతు జేఏసీ కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, బీఆర్ఎస్ మండలజనరల్ సెక్రెటరీ సంధిల భాస్కర్‌గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, పట్టణ, గ్రామశాఖ అధ్యక్షుడు బెడిదే వీరేశం, గజ్జలరాజు, గుర్రం నరసింహులు, చింతల కోటయ్య, చింతల దాసు, కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలను గెలుపించాలి

నవతెలంగాణ-భువనగిరి

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థులను బీసీలంతా ఏకమై అఖండ మెజార్టీతో గెలిపించాలని బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించడం ద్వారా బీసీల రాజకీయ శకం ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం భువనగిరి పట్టణ కేంద్రంలోని ఎస్వీ హోటల్ నిర్వహించిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థి పూల రవీందర్‌కు బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీలు అంతా సంఘటితమై గెలిపిస్తే నల్లగొండ జిల్లాలో రెడ్ల రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి బీసీ సీఎం అవుతాడని జోస్యం చెప్పారు.నేడు బీసీ సంక్షేమ సంఘం బీసీల ఓటు బీసీలకే ఓటు మనదే సీటు మనదే అనే నినాదంతో ముందుకుపోతున్నామన్నారు. ఈనెల 17 నుండి 26 వ తేదీ వరకు 'బీసీల ఓటు బీసీలకే' నినాదంతో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న జిల్లాల్లో సభలు సమావేశాలు సెమినార్లతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి, భువనగిరి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సాబన్‌కార్ వెంకటేష్, యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు అశోకచారి, వలిగొండ మండల అధ్యక్షులు సాయినియాదగిరి, ఆలేరు నియోజకవర్గ అధ్యక్షులు పేరపురాములు, కంబాలపల్లి శ్రీరాములు, వట్టిపల్లి రాజు, పల్లెరాజాలుగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన యువకులు, క్రీడాకారులు



నవతెలంగాణ-రామన్నపేట

ఇటీవల రామన్నపేట పట్టణంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పర్యటించిన సందర్భంలో రామన్నపేట పట్టణానికి చెందిన కొంతమంది యువకులు, క్రీడాకారులు ఆటలాడుకోవడానికి క్రీడాస్థలం కావాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం లోతుకుంటలో ఉన్న కంపచెట్లను తొలగించే ప్రక్రియను ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు నాయకులు, యువకులు ఆటస్థలంగా మారుస్తున్న ప్రాంతాన్ని సందర్శించి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు జెల్లా వెంకటేష్, గోదాసు పృథ్వీరాజ్, ఎండి.నాసర్, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జమీరోద్దీన్, అక్రమ్, కోట సుధాకర్, గొలుసుల ప్రసాద్, కరీం, తదితరులు ఉన్నారు.

నేడు డిండిలో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమం



నవతెలంగాణ-డిండి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమంను శనివారం ఉదయం 11గంటలకు డిండి పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం డిండి పోలీస్ స్టేషన్లో ఎస్పీ శరత్ చంద్ర పవార్ అందుబాటులో ఉంటారని తెలిపారు. బాధితుల ఫిర్యాదులను పోలీసు స్టేషన్లలోనే పరిశీలించి సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యల గురించి ఎస్పీని స్వయంగా కలిసి దరఖాస్తులు సమర్పించి తమ సమస్యలను పరిష్కరించు కునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మానవ నాగరికతలో భాషల పాత్ర మహోన్నతమైంది



నవతెలంగాణ-నకిరేకల్

భాషే మనిషికి గుర్తింపు ప్రచారాన్ని కల్పించిందని, భూగోళం మీద ప్రతిభాష గొప్పదేనని, మానవ నాగరికతలో భాషల పాత్ర మహోన్నతమైనదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా.బెల్లి యాదయ్య అన్నారు. శుక్రవారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మాతృభాష విశిష్టతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో ఐక్యుఏసి కోఆర్డినేటర్ ఎం. శ్రీనివాస చారి, వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశపరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-నిడమనూరు

2024 -25 ఏడాదికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిడమానూరు గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష జరగనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష సమయానికి విద్యార్థులు ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. బాల్ పాయింట్ పెన్నులు హాల్ టికెట్స్ పరీక్ష ప్యాడ్ తప్పనిసరిగా పరీక్షకు తీసుకొని రావాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నవతెలంగాణ-పెద్దవూర



మండలంలోని పర్వేదుల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు దండ వీరారెడ్డి ఆధ్వర్యంలో స్వపరి పాలనదినోత్సవం ఘనంగా నిర్వహించారు.విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, మంత్రులుగా ఎంఎల్ ఏ లుగా ఒక్కరోజు తమ ప్రతిభా పాటవాలతో తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాబోధించారు.ఒక్క రోజు వారి విధులను చక్కగా నిర్వర్తించారు.అనంతరం ఉత్తమ ప్రతిభ కన్పర్చిన వారికీ బహుమతు లు అందజేశారు. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని మన సంస్కృతి, సంప్రదాయాలను ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే ప్రదర్శనలతో అలరించారు.ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయులు విద్యార్థులకు బాలల స్వపరి పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడారు.విద్యార్థులు నైతిక విలువలు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించాలని విద్య ఒక్కట్టె మనల్ని సమాజంలో ఉన్నత స్థాయిలో నిలబెట్టగలదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్

గురుకుల ప్రవేశ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నీలా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి, 6, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 23న బాలెంలలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 753 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షకు సమయానికి గంట ముందుగా విద్యార్థుల ను పరీక్షా హాల్లో కి అనుమతిస్తామన్నారు. పరీక్షకు కావలసినవి బాల్ పాయింట్ పెన్(బ్లూ, బ్లాక్), హాల్ టికెట్, పరీక్షా ప్యాడ్, ఆధార్ కార్డు, పాస్ ఫోటో తప్పనిసరిగా తీసుకొని పరీక్షకు హాజరు కావాలన్నారు.ఓఎంఆర్ పద్ధతిలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యం, విద్యార్థులు పరీక్షలు రాసేందుకు డెస్క్ బెంచీలు ఏర్పాటు చేససినట్లు తెలిపారు.

రైతులకు యూరియా, క్రాప్‌లోన్స్ అందజేత



నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు శుక్రవారం పీఏసీఎస్ చైర్మెన్ గట్టుపల్లి నర్సిరెడ్డి యూరియా, మంజూరైన క్రాప్ లోన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజా పాలన సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, హరీష్, సహకార సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాతృభాష తల్లిపాలవంటిది

నవతెలంగాణ-రామన్నపేట



అమ్మ పాల నుండి సంక్రమించిన భాష మాతృభాష అని, మాతృభాష తల్లిపాల వంటిదైతే పరభాష దాది పాల వంటిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్‌ఖానం అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు అధ్యక్షత వహించిన సభలో ఆమె మాట్లాడుతూ ఈ భాషనైనా నేర్చుకోవచ్చు కానీ మాతృభాషలో పట్టు సాధించడం మరువొద్దన్నారు. ప్రాథమికస్థాయిలో విద్యాబోధన మాతృభాషలో ఉండేలా చూడాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషలోనే మాట్లాడాలని తెలిపారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య మాట్లాడుతూ ఒక భాష కనుమరుగైతే దానితోపాటు ఆ భాష మాట్లాడే జాతి కూడా కనుమరుగవుతుందన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా కనీసం ప్రాథమిక పాఠశాల స్థాయి వరకైనా మాతృభాషలో విద్యాబోధన జరిగేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చినబాబు, డాక్టర్ సిహెచ్ వెంకట్‌గౌడ్, ఎం.అనిత, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ పి.బ్రహ్మం, డాక్టర్ ఎం.రవీందర్‌రావు, టి.శ్రీనివాస్, ఎ. ఆంజనేయులు, యాదగిరి, జె నరేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవాల్లో విద్యార్థులు పుస్తకాల ప్రదర్శన పొడుపు కథలు, సామెతలు అంతేకాకుండా ఆటలైనటువంటి దాడి ,నిచ్చెన ఆట ,తెలంగాణ అక్క, పోతురాజు, పిట్టలదొర ,గౌడు, బటులు ఇలా విచిత్ర వేషధారణలో విద్యార్థులు అలరించారు. విద్యార్థులు నాటికలు మరియు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు గీత మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి ఒక్కరూ మాతృభాషణ సంరక్షించుకోవాలని అన్నారు . ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిరేకల్ : శిశువు మనోవికాసానికి, భావ వినిమయానికి మాతృభాషకు మించిన సాధనం లేదని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తాటికల్ ఉన్నత పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తెలుగు భాష పై విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన బాల సభ అందరినీ అలరించింది. బాల సభకు పొల్లెగోని నాగసాయి అధ్యక్షత వహించగా ప్రముఖ కవి అవుసుల భాను ప్రకాష్ రాసిన ట్రెండింగ్ పద్యాలు పుస్తకాన్ని ఆకిటి ఆశ్రిత ఆవిష్కరించింది. ఆరవ తరగతి విద్యార్థి మేడ శశివర్ధన్ పుస్తక సమీక్ష చేశారు. వక్తలుగా విద్యార్థులు అనేక విషయాలను వివరించారని ఎంఈఓ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి నూకల జానయ్య, ఆఫీస్ సబార్డినేట్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండలంలోని వెల్మగూడెం కాంప్లెక్స్ పరిధిలోని గర్నెకుంట సేయింట్ థామస్ తామస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాతృభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టి థామస్ స్కూల్ ఏఓ మార్టిన్ మాథ్యూ మాట్లాడుతూ విద్యార్థులు తమ మాతృభాష పట్ల గౌరవం ఉండాలని మరియు అన్య భాషలు నేర్చుకొని ప్రతిభవంతులు కావాలని తెలిపారు.ఈ మాతృభాషా దినోత్సవం గురించి తగిన చరిత్రను విద్యార్థులకు వివరించి మాతృభాష గొప్పతనా న్ని చాటిచెప్పాప్పేలా విద్యార్థులు కూడా తెలుగు భాష గొప్పతనం గురించి ప్రసంగించారు.అనంతరం విద్యార్థుల కు మాతృభాష మీద వ్యాసరచన పోటీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయులు ప్రియాంక, జిస్మి, శ్రీనయ్య, పద్మావతి, జాన్సిరీణు, వరలక్ష్మి, సంగీత, పద్మ, శ్రీలత రెడ్డి, ధనలక్ష్మి, శుభశ్రీ, ఆశ,రాజశ్రీ, స్వాతి, హిప్సిబా మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ బాక్సులు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-బొమ్మలరామారం

సెంట్రింగ్ బాక్సులు దొంగతనం చేసిన వ్యక్తిని బొమ్మలరామారం పోలీసులు పట్టుకున్నారు.ఈ మేరకు శుక్రవారం ఎస్సై బుగ్గ శ్రీశైలం అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండలంలోని నాగినేనిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము నాగేష్ సెంట్రింగ్ పని చేస్తాడు.ఎప్పటిలాగానే వారి ఇంటి వద్ద బాక్సులు పెట్టాడు.బుధవారం తెల్లవారుజామున చూసేవరకు సెంట్రింగ్ బాక్సులు గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 43 బాక్సులు దొంగలించారని స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నప్పుడు ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని విచారించగా రామస్వామి తండకు చెందిన ధీరావత్ వినోద్, చొప్పరిచెట్టు తండాకు చెందిన ధీరవత్ రాజేష్ ఆర్థికఇబ్బందులతో ఎలాగైనా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో దొంగతనం చేశామని ఒప్పుకున్నారు.వారి వద్ద నుండి డ్యాక్ బండి,హోండా స్వాధీనం చేసుకున్నారు.వాటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది.ధీరవత్ రాజేష్ పరారీలో ఉన్నట్టు స్పెషల్ టీం గాలిస్తున్నారని తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్‌రాజు, సందీప్, మహబూబ్‌లను ఎస్సై శ్రీశైలం అభినందించారు.

గురుకుల ప్రవేశ పరీక్ష టీజీసెట్ -2025 సర్వం సిద్ధం

నవతెలంగాణ-రాజపేట

తెలంగాణ రాష్ట్రంలో 23వ, ఆదివారం నాడు 5వ, తరగతి గురుకుల పాఠశాలలో ప్రవేశం కొరకు,ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నిర్వహించే టీజీసెట్ -2025 పరీక్షకు అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని చీఫ్ సూపరింటెండెంట్ వేణుప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌లో ఆయా పరీక్షాకేంద్రాల ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్స్ కూడా ఇచ్చామన్నారు.చిరునామ కొరకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే అట్టి ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయొచ్చన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. హాల్‌టికెట్‌లో ఏమైనా తప్పిదాలు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో హాజరైతే వాటిని సరి చేస్తారన్నారు.స్థానిక రాజపేట సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి కావడం జరిగిందని, విద్యార్థులంతా పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కోరారు.

కలకలం రేపుతున్న కాంగ్రెస్ కమిటీలు

డీసీసీ ప్రమేయం లేకుండానే తన ఆదేశాలతో కమిటీల ప్రకటన
జిల్లా అధ్యక్షుడితో ఫోన్‌లో సంభాషించిన నవీన్‌రెడ్డి

నవతెలంగాణ-మోటకొండూరు

మండల కేంద్రంలో కాంగ్రెస్ కమిటీలు కాక రేపటమే కాదు.. ఏకంగా డీసీసీ ఆదేశాలతో గ్రామ కమిటీల ఏర్పాటు చేస్తున్న విషయం అందరికి విధితమే. శుక్రవారం మోటకొండూర్ గ్రామ శాఖ నవీన్‌రెడ్డిని కారణం లేకుండా సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షులు గంగపురం మల్లేశ్ ప్రకటించారు.విషయం తెలుసుకున్న నవీన్‌రెడ్డి గ్రామ శాఖ డీసీసీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డితో ఫోన్‌లో సంప్రదించగా వారు తనకు తెలియకుండా ఎలా చేస్తారు.. నా పేరు పైన అని మండల శాఖను ఘాటుగా వ్యాఖ్యానించినట్లు వీడియో రికార్డు బయటపడింది. ఎమ్మెల్యే చెబితే నా పేరు ఎలా పెడతావ్? ఎదైనా ఉంటే ఇక నుండి పూర్తి విషయాలు చెప్పేంత వరకు నా పేరు పెట్టకూడదదని చెప్పానని ఫోన్‌లో నవీన్‌రెడ్డితో సంభాషించారు.ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ మండలకేంద్రంలో కాంగ్రెస్ కోసం అహర్నిశలు కృషి చేశామన్నారు. డీసీసీ ప్రమేయం లేకుండానే కమిటీల నియామకం ఏర్పాటు ఎంత వరకు సమంజసమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మెజార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే తీరుపై వ్యతిరేకంగా ఉన్నారని, అభిప్రాయాలు స్వీకరించకుండా కమిటీల ఏర్పాటు చేసి పార్టీకి నష్టం చేకూర్చే పనిలో మండల నాయకత్వం ఉందన్నారు.మేము వారసత్వ పరంగా పార్టీ కోసమే పని చేశామని, అవకాశవాద రాజకీయాలు సహించబోమన్నారు. తనను కారణం లేకుండా బహిష్కరించడం శోచనీయమన్నారు. కార్యకర్తల అభిప్రాయాలు స్వీకరించి పార్టీ మనుగడ ఉనికి కోసం మండలంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి నివాసంలో నల్లగొండ జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మెన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంల్లో మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రావుల శ్రీను, రేగట్టే మహేందర్ రెడ్డి, దోనాల నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.